ఈనాటి
# తెలుగోడు
PRGI-NO-APTEL/25/A2739
EENAATI TELUGODU... Telugu Daily
https://www.eenaatitelugodu.com

Ph:8368102842
నాశా క్లినిక్
డా.భానుప్రకాష్ MBBS
సంప్రదించు వేళలు: ఉ.7.30 నుంచి 8.30 వరకు
సా.4 గం.నుంచి రాత్రి.8.30 వరకు
డా.నిహారిక BHMS
సంప్రదించు వేళలు:
ఉ.9 గం. నుంచి సా.5 గం. వరకు
Ph:9704461510
మా మెడికల్స్
ఎమ్మార్వో ఆఫీస్ ఎదురుగా ఓ.డి.చెరువు

సంపుటి-1 | సంచిక - 136 | శనివారం 14 ఫిబ్రవరి 2026 | పేజీలు - 8 | వెల - రూ.. 5
Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati



## నేడే రాష్ట్ర బడ్జెట్

- రూ 3.50 లక్షల కోట్ల దాకా వ్యయ ప్రణాళిక..
- సాగునీటి రంగానికి ప్రత్యేక కేటాయింపుల సూచనలు..
- రాజధాని నిర్మాణానికి స్పష్టమైన నిధుల రూపకల్పన..
- ఉత్తరాంధ్ర, రాయలసీమ సమగ్ర అభివృద్ధికి పెద్దపీట..
- మహిళా సాధికారితకు ఆడబిడ్డ నిధి ప్రకటనపై ఆసక్తి..
- సంక్షేమం, అభివృద్ధి సమతుల్యతకు దిశా నిర్దేశం..

**బాబ్‌జాన్, (తెలుగోడు) ప్రత్యేక ప్రతినిధి**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక ఆర్థిక ప్రణాళికను తుదిదశకు తీసుకొచ్చింది. నేడు (ఫిబ్రవరి 14వ తేదీ) ఉదయం 11.15 గంటలకు శాసనసభలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఈ ప్రణాళికను ప్రవేశపెట్టనున్నారు. అనంతరం వ్యవసాయ శాఖకు సంబంధించిన ప్రణాళికను మంత్రి అచ్చెన్నాయుడు సభ ముందుంచనున్నారు. ఈసారి మొత్తం వ్యయం దాదాపు రూ.3.45 లక్షల కోట్ల నుంచి రూ.3.50 లక్షల కోట్ల వరకు ఉండవచ్చని అంచనాలు వ్యక్తమవుతున్నాయి.రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, ఆదాయ వనరులు, కేంద్రం నుంచి లభించే పన్నుల వాటా, వివిధ రంగాలకు లభించే సహాయక నిధులను సమగ్రంగా విశ్లేషించి ఈ ప్రణాళిక రూపొందించబడుతోంది. అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల మధ్య సమతుల్యత సాధించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. ఆదాయం, వ్యయం మధ్య సమన్వయం, అప్పుల భారం నియంత్రణ, భవిష్యత్ అవసరాలకు నిల్వలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.ఎన్నికల సమయంలో ప్రకటించిన హామీల అమలుకు ఈ ప్రణాళికలో ఆర్థిక బలం కల్పించనున్నారు. ఇప్పటికే అమలులో ఉన్న పథకాల కొనసాగింపుతో పాటు పెండింగ్‌లో ఉన్న 'ఆడబిడ్డ నిధి' పథకంపై కీలక ప్రకటన వచ్చే అవకాశముంది. 18 సంవత్సరాలు దాటిన మహిళలకు నెలకు రూ.1500 చెల్లించే విధానం ద్వారా మహిళల ఆర్థిక స్వావలంబనకు ఊతమివ్వాలన్న ఉద్దేశం ప్రతిఫలించనుంది. సాగునీటి రంగానికి ఈసారి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. వర్షాధార ప్రాంతాల్లో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడం, పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడం, కొత్త సాగునీటి మార్గాలను అభివృద్ధి చేయడం వంటి అంశాలకు గణనీయ కేటాయింపులు ఉండే అవకాశముంది. ప్రత్యేకంగా సాగునీటి రంగానికి వేరు ప్రణాళికను ప్రవేశపెట్టే ప్రయత్నం జరుగుతుండటం గమనార్హం.రాజధాని అమరావతి నిర్మాణానికి అవసరమైన నిధుల కేటాయింపుపై కూడా స్పష్టత వచ్చే అవకాశముంది. (మిగతా 2లో)



## కల్తీ లడ్డూ వ్యవహారంలో ఇదీ అసలు నిజం

- ఎన్నికల కోడ్ తర్వాతే టెండర్లు పూర్తి..
- ప్రభుత్వం మారిన తర్వాతే నెయ్యి సరఫరా ప్రారంభమైందని స్పష్టం..
- నాణ్యత పరీక్షల్లో ఫెయిల్ అయిన ట్యాంకర్లు వెనక్కి పంపాం..
- వెనక్కి పంపిన ట్యాంకర్లు మళ్లీ టీటీడీకి చేరాయి..
- 2014-19 మధ్య కూడా అదే కంపెనీల ద్వారా సరఫరా..
- నెయ్యి సేకరణలో పటిష్ట పరీక్షా విధానం అమలులో వుంది..
- మాజీ సిఎం వైయస్. జగన్‌మోహన్‌రెడ్డి..

**తాడేపల్లి (తెలుగోడు), ఫిబ్రవరి 13 :**

లడ్డూ వ్యవహారం రాజకీయ రంగు పులుముకుంటున్న నేపథ్యంలో వైఎస్సార్సీపీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి పార్టీ ముఖ్య నేతలతో నిర్వహించిన సమావేశంలో అంశాన్ని విపులంగా ప్రస్తావించారు. టీటీడీలో నెయ్యి కల్తీ జరిగిందనే ఆరోపణలు, ఆ నెయ్యితో లడ్డూ ప్రసాదం తయారైందనే ప్రచారం నేపథ్యంలో వాస్తవ పరిస్థితులను తేదీల వారీగా వివరించారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత తీసుకున్న పరిపాలనా నిర్ణయాలను స్పష్టంగా ఉంచారు.రాష్ట్రంలో మార్చి 16, 2024న ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిందని, మే 13న పోలింగ్ నిర్వహించబడిందని తెలిపారు. మే 15న టీటీడీలో నెయ్యి సరఫరాకు సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తై ఏఆర్ డెయిరీకి కాంట్రాక్ట్ కేటాయించబడిందని వివరించారు. జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడగా ప్రభుత్వం మారిందని గుర్తుచేశారు. ప్రభుత్వం మారిన తర్వాతే నెయ్యి సరఫరా ప్రారంభమైందని పేర్కొన్నారు.జూన్ 12, 20, 25 తేదీల్లో, జూలై 4న మొత్తం నాలుగు ట్యాంకర్లు నెయ్యి టీటీడీకి చేరాయని తెలిపారు. అవన్నీ ప్రయోగశాల పరీక్షల్లో ఉత్తీర్ణం కావడంతో స్వీకరించబడినట్లు చెప్పారు. అనంతరం జూలై 6, 12 తేదీల్లో వచ్చిన మరో నాలుగు ట్యాంకర్ల నమూనాలు నాణ్యత ప్రమాణాలు అందుకోలేదని వెల్లడించారు. జూలై 23న ప్రయోగశాల నివేదిక అందడంతో జూలై 25న ఆ ట్యాంకర్లను అధికారికంగా వెనక్కి పంపినట్లు వివరించారు.వెనక్కి (మిగతా 2లో)

### పాలకమండళ్లు పటిష్టంగా వుంటే
## అపచారాలు జరగవు



- రాజకీయాలకు అతీతంగా దేవాలయాలను పరిరక్షించాలి..
- గతంలో జరిగిన అపచారాలు పునరావృతం కారాదు..
- శ్రీకాళహస్తి గిరి ప్రదక్షిణను వర్చువల్‌గా ప్రారంభించిన పవన్..

**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 13 :**

దేవాలయాల పరిరక్షణపై కీలక వ్యాఖ్యలు చేశారు ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. పాలక మండళ్లు బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తే దేవాలయాల్లో అపచారాలు జరగవని, రాజకీయాలకు అతీతంగా దేవాలయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత పాలక మండళ్లపై ఉందని పవన్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో తిరుమలలోనే ఎన్నో అపచారాలు జరిగాయన్నారు. నాటి పాలక మండలి బాధ్యతగా వ్యవహరిస్తే తప్పులు జరిగేవి (మిగతా 2లో)

## ఆకలికి మతం లేదు



- రూ 10కే కోవా బన్ అమ్ముతున్న వలీపై అనుమానాల వర్షం..
- వ్యూస్ కోసం మతం రంగు పులిమారనే నెటిజన్ల ఆగ్రహం..
- చిన్నవ్యాపారిని టార్గెట్ చేయడమా..
- పేదల పక్షాన నిలవాలని పరిటా శ్రీరాం ఘాటు వ్యాఖ్యలు..

**అనంతపురం (తెలుగోడు), ఫిబ్రవరి 13 :**

మేడారం జాతర సందడిలో ఓ చిన్న కోవా బన్ స్టాల్ వద్ద మొదలైన వివాదం పెద్ద చర్చకు దారితీసింది. కేవలం రూ.10కే కోవా బన్ విక్రయిస్తున్న వలీ అనే చిరు వ్యాపారిని ఓ యూట్యూబ్ ఛానల్ ప్రతినిధి బహిరంగంగా ప్రశ్నించడం వివాదానికి కారణమైంది. "ఇంత తక్కువ ధరకు ఎలా ఇస్తావు? ఏదైనా కలిపావా?" అంటూ అనుమానాలు వ్యక్తం చేయడమే కాకుండా, మతాన్ని ప్రస్తావిస్తూ వ్యాఖ్యలు చేయడం సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలకు గురైంది. కష్టపడి జీవనం సాగించే చిన్న వ్యాపారిని ప్రోత్సహించాల్సింది పోయి, వ్యూస్ కోసం అతని (మిగతా 2లో)

## హెరిటేజ్ ప్రతిష్టపై కక్ష



- అవాస్తవ కథనాలతో కుటుంబ వ్యాపారం లక్ష్యంగా కుట్రలు..
- గత పాలనలో విధ్వంసం నుంచి రాష్ట్రం కోలుకుంటోంది..
- ఆలయాల పవిత్రతను కాపాడటంలో రాజీ వుండదు..
- రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 13 :**

రాష్ట్ర శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విస్తృతంగా మాట్లాడారు. రాష్ట్ర పునర్నిర్మాణమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, గత పాలనలో జరిగిన విధ్వంసం నుంచి రాష్ట్రం క్రమంగా కోలుకుంటోందని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసంతో ఏర్పడిన ప్రభుత్వం సమన్వయంతో ముందుకు సాగుతోందని తెలిపారు.2019 నుంచి 2024 వరకు రాష్ట్రంలో చోటుచేసుకున్న పరిణామాలు ప్రజలను తీవ్రంగా బాధించాయని అన్నారు. శాసనసభలో జరిగిన కొన్ని సంఘటనలు తనను వ్యక్తిగతంగా కలచివేశాయని, (మిగతా 2లో)

## స్కూళ్లు మరింత మెరుగుపడాలి

- ప్రభుత్వ పాఠశాలల్లో 40శాతం రెండు స్టార్స్‌కంటే తక్కువ..
- 18ప్రమాణాలపై రాష్ట్ర వ్యాప్తంగా రేటింగ్ ప్రక్రియ..
- మౌలిక వసతుల కోసం రూ 7500 కోట్ల అవసరం..
- లీక్ ప్రూఫ్ భవనాలు, బెంచీలు, తాగునీరు అత్యవసరం..
- జిల్లాల వారీగా లోపాల గుర్తింపు..
- శాసనమండలిలో మంత్రి నారాలోకేష్..



**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 13 :**

ప్రభుత్వ పాఠశాలల పరిస్థితిపై శాసనమండలిలో విస్తృత చర్చ జరిగింది. సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా విద్యామంత్రి నారా లోకేష్ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన స్టార్ రేటింగ్ ప్రక్రియ వివరాలను వెల్లడించారు. మొత్తం 18 ప్రమాణాల ఆధారంగా పాఠశాలలను అంచనా వేసినట్లు తెలిపారు. భవనాల స్థితి, తరగతి గదుల సౌకర్యాలు, బెంచీలు, ఫర్నిచర్, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సదుపాయం, పరిశుభ్రత, ప్రాంగణం వంటి అంశాలను పరిశీలించి రేటింగ్ కేటాయించినట్లు చెప్పారు. (మిగతా 2లో)

## 2029 లక్ష్యం

**ఎమ్మెల్యేల పనితీరుపై ప్రోగ్రెస్ రిపోర్టులు.. మచిలీపట్నం పరిధిలో గుడివాడ,. గన్నవర పై ప్రత్యేక దృష్టి ..చంద్రబాబు..**

**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 13 :**

2029 ఎన్నికల్లో విజయం సాధించాలన్న లక్ష్యంతో పార్లమెంటరీ నియోజకవర్గాల వారీగా సమీక్షలు ప్రారంభించారు. ఆయా పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఇన్ చార్జ్‌లతో సమావేశాలు నిర్వహిస్తూ క్షేత్ర స్థాయి నివేదికలను విశ్లేషిస్తున్నారు.ముందుగా మచిలీ పట్నం పార్లమెంటరీ నియోజకవర్గంపై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి, ముఖ్యంగా గుడివాడ, గన్నవరం నియోజకవర్గాల పరిస్థితిపై సేకరించిన సమాచారాన్ని పార్టీ నేతల ముందుంచారు. భవిష్యత్ కార్యాచరణపై స్పష్టమైన దిశా నిర్దేశం చేస్తూ మిషన్ 2029లో భాగంగా ఎట్టి పరిస్థితుల్లోనూ సీట్లు నిలబెట్టుకోవాలని నేతలకు తేల్చిచెప్పారు.అసెంబ్లీ సమావేశాల సమయానికే ఎమ్మెల్యేలతో వరుస భేటీలు (మిగతా 2లో)

## ఉచిత బస్సుకు మరిత పటిష్టత

- ప్రజా రవాణాపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి...
- ఎంటీ కృష్ణబాబు స్థానంలో మార్పు...
- ఆర్టీసికి కొత్త అధిపతి.. ఐపీఎస్ బాలసుబ్రమణ్యం..
- త్వరలో బాధ్యతల స్వీకరణ..



**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 13 :**

రాష్ట్ర ప్రజారవాణా వ్యవస్థలో కీలక మార్పు చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయం తీసుకుంటూ ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పదవికి సీనియర్ ఐపీఎస్ అధికారి బాల సుబ్రమణ్యం ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఈ బాధ్యతలను తాత్కాలికంగా నిర్వహిస్తున్న సీనియర్ ఐఏఎస్ అధికారి ఎంటీ కృష్ణబాబు స్థానంలో మార్పు చేపట్టారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజారవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సంకల్పించింది. ముఖ్యంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలనే ఎన్నికల హామీ మేరకు గత ఏడాది ఆగస్టు 15న స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభించింది. ఎంపిక చేసిన కేటగిరీల్లో ఈ పథకం అమలవుతూ రాష్ట్రవ్యాప్తంగా విశేష స్పందన పొందుతోంది. ప్రతిరోజూ లక్షలాది మహిళలు ఈ సౌకర్యాన్ని (మిగతా 2లో)

# నేడే రాష్ట్ర బడ్జెట్

(మొదటి పేజీ (తరువాయి)

అవకాశముంది. మౌలిక సదుపాయాలు, పరిపాలనా భవనాలు, రహదారులు, నీటి సరఫరా, విద్యుత్ వ్యవస్థల అభివృద్ధి వంటి పనులకు దశలవారీ ఆర్థిక ప్రణాళిక సిద్ధమవుతోంది. రాజధాని అభివృద్ధి రాష్ట్ర ఆర్థిక చైతన్యానికి కేంద్రబిందువుగా ఉండేలా కూర్పు సాగుతోందని తెలుస్తోంది. ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల అభివృద్ధి కూడా ఈసారి ప్రధాన అంశంగా నిలుస్తోంది. పరిశ్రమలు, సాగునీటి సదుపాయాలు, విద్యా--ఆరోగ్య రంగ మౌలిక వసతుల విస్తరణకు పెద్దపీట వేయనున్నారు. ప్రాంతీయ అసమానతలు తగ్గించే దిశగా కేటాయింపులు ఉండే అవకాశముంది.
పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక నిధులు కేటాయించే అవకాశముంది. పెట్టుబడులను ఆకర్షించడం, యువతకు ఉపాధి అవకాశాలు సృష్టించడం, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు మద్దతు ఇవ్వడం వంటి అంశాలు ప్రాధాన్యం పొందనున్నాయి. పరిశ్రమలకు చెల్లించాల్సిన ప్రోత్సాహకాలను సమయానికి చెల్లించేందుకు ప్రత్యేక ఖాతాల ఏర్పాటుపై ప్రభుత్వ సంకల్పం ప్రతిఫలించే అవకాశముంది.
సంక్షేమ రంగంలో తల్లికి వందనం, దీపం-2.0, అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు వంటి పథకాలకు తగిన ఆర్థిక బలం కల్పించనున్నట్లు సమాచారం. రైతులు, మహిళలు, వృద్ధులు, నిరుద్యోగులు, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు అందించే సహాయ కార్యక్రమాలకు నిరంతర నిధుల ప్రవాహం ఉండేలా కూర్పు జరుగుతోంది. మొత్తం మీద ఈ ఆర్థిక ప్రణాళిక రాష్ట్ర అభివృద్ధికి దిశానిర్దేశం చేయడమే కాకుండా, సంక్షేమానికి బలమైన ఆధారాన్ని కల్పించే విధంగా ఉండబోతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆదాయం,వ్యయం సమతుల్యత, ప్రాంతీయ సమగ్ర అభివృద్ధి, మహిళా సాధికారత, సాగునీటి విస్తరణ, రాజధాని నిర్మాణం వంటి అంశాలు ఈసారి ప్రధాన ధోరణిగా నిలిచే అవకాశముంది.

## పాలకమండళ్లు పటిష్టంగా వుంటే
# అపచారాలు జరగవు




(మొదటి పేజీ (తరువాయి)

కాదని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఆలయ పాలక మండళ్లు గత ప్రభుత్వంలో జరిగిన తప్పులు, అపచారాలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నూతనంగా నిర్మించిన శ్రీకాళహస్తి గిరిప్రదక్షణ రోడ్డును వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం నుంచి పవన్ కల్యాణ్ వర్చువల్ గా ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన ఆలయాలు నాగరికతకు చిహ్నాలు అన్నారు. మన కళలు, మన వారసత్వం, మన సంస్కృతి, ధర్మ పరిరక్షణ ఆలయాలతో ముడిపడి ఉన్నాయి. అరుణాచలంలో గిరిప్రదక్షణ చేస్తారు అని తెలుసు.. నాకు గిరిప్రదక్షణ చేయాలని చాలా కోరిక ఉంది. దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆహ్వానం మేరకు, భక్తుల కోరిక మేరకు త్వరలో శ్రీకాళహస్తి క్షేత్రాన్ని సందర్శించి కచ్చితంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటానన్నారు.. శివరాత్రికి రెండు రోజుల ముందు ఈ శ్రీకాళహస్తి గిరి ప్రదక్షణ మార్గాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు పవన్.. గత ప్రభుత్వం ఆలయాల పరిరక్షణ అంశాన్ని చాలా నిర్లక్ష్యం చేసిందన్నారు.. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత దేవాదాయ మంత్రిగా రామనారాయణ రెడ్డి బాధ్యతలు స్వీకరించాక ఆలయాల పరిరక్షణను ఎంతో బాధ్యతగా ముందుకు తీసుకువెళు న్నాం అన్నారు. నిరాదరణకు గురైన ఎన్నో ఆలయాలను అభివృద్ధి చేస్తున్నారని.. భక్తులు కోరుకుంటే ఏజెన్సీలో కూడా ఆలయాలు నిర్మించాలన్న ఆయన గొప్ప సంకల్పానికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నా అన్నారు పవన్ కల్యాణ్..శివరాత్రి తర్వాత గిరిప్రదక్షణ మార్గంలో మొక్కలు నాటుతామని.. శ్రీకాళహస్తి గిరిప్రదక్షణ మార్గంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రూ. 10 కోట్లు వెచ్చించి సిమెంటు రోడ్డు నిర్మించామన్నారు. 22 కిలోమీటర్ల గిరి ప్రదక్షణ మార్గాన్ని మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నాం అన్నారు.. అటవీ శాఖ ఆధ్వర్యంలో గిరిప్రదక్షణ మార్గానికి ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమానికి శివరాత్రి బ్రహ్మోత్సవాల అనంతరం శ్రీకారం చుట్టబోతున్నాం అన్నారు.. శ్రీకాళహస్తి గిరిప్రదక్షణ ద్వారా ప్రతి భక్తుడికి కైలాసగిరి ప్రదక్షణ చేసిన పుణ్యఫలం దక్కాలని ఈ సందర్భంగా మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాన్నార ు.సంక్షేమ ఆంధ్రప్రదేశ్ మాత్రమే కాదని ఆధ్యాత్మిక ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతామని.. ఇందుకోసం అనేక కార్యక్రమాలు చేపట్టామని ఏపీ దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. 15,016 ఆలయాలకు పాలకమండళ్లను వేయాల్సి ఉందని తెలిపారు. ఇప్పటికే సుమారు వెయ్యి ఆలయాలకు పాలమండళ్లను నియమించామని చెప్పుకొచ్చారు. మిగిలిన వాటిపైనా దృష్టి సారిస్తామని మంత్రి చెప్పుకొచ్చారు.

# హెరిటేజ్ ప్రతిష్టపై కక్ష

(మొదటి పేజీ (తరువాయి)

తాను కన్నీళ్లు పెట్టుకున్న సందర్భాలు కూడా ఉన్నాయని గుర్తుచేశారు. ఆ కాలంలో ప్రజలు అనుభవించిన వేదనను మరచిపోలేమని వ్యాఖ్యానించారు. విశాఖ పట్నంలో పర్యటనకు వెళ్లిన పవన్ కళ్యాణ్ ను అడ్డుకున్న ఘటనను ప్రస్తావిస్తూ, అప్పట్లో ప్రజాస్వామ్య హక్కులను నిరోధించినవారే ఇప్పుడు నీతులు చెబుతున్నారని విమర్శించారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, తగిన సమయంలో సరైన తీర్పు ఇస్తారని పేర్కొన్నారు. శాంతిభద్రతల విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని స్పష్టం చేశారు. తిరుపతి లడ్డూ వ్యవహారం అత్యంత సున్నితమైన అంశమని పేర్కొంటూ, కొందరు కావాలనే దేవాలయ పవిత్రతను దెబ్బతీయాలని ప్రయత్నించారని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులు ఒక్కసారైనా వేంకటేశ్వర స్వామి దర్శించుకోవాలని భావిస్తారని గుర్తుచేశారు. జరిగిన తప్పులను బయటపెట్టకుండా ఉంటే అపవిత్రత కొనసాగుతుందని హెచ్చరించారు. దేవాలయాల పవిత్రత కాపాడటంలో ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుంటుందని తెలిపారు. కల్తీ నెయ్యి సరఫరా అంశాన్ని ఉద్దేశపూర్వకంగా హెరిటేజ్ సంస్థతో ముడిపెట్టి ప్రతిష్టను దెబ్బతీయాలనే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. హెరిటేజ్ ఫుడ్స్ కుటుంబ ఆధారిత వ్యాపారమని, దాని గౌరవాన్ని దెబ్బతీయడానికి అవాస్తవ కథనాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ప్రత్యర్థులను ఆర్థికంగా దెబ్బతీయాలనే ధోరణి గతంలో కూడా కనిపించిందని వ్యాఖ్యానించారు. వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసును ప్రస్తావిస్తూ, ఆ ఘటనలో అనేక నాటకాలు ఆడారని పేర్కొన్నారు. తమపై వచ్చిన ఆరోపణలను తప్పించుకునేందుకు ఇతరులపై మోపే ప్రయత్నాలు జరిగాయని అన్నారు. రాయలసీమలో గతంలో సాగిన వర్గ రాజకీయాల ధోరణి ఇప్పటికీ కనిపిస్తోందని విమర్శించారు. మద్యం వ్యవహారంలో గత పాలనలో ప్రజల ప్రాణాలను పణంగా పెట్టారని ఆరోపిస్తూ, సుమారు మూడు వేల రెండు వందల కోట్ల మేర అక్రమాలు జరిగాయని తెలిపారు. ఆ అంశంపై న్యాయస్థానాలు కూడా గంభీరంగా వ్యవహరించాయని చెప్పారు. ప్రస్తుతం ప్రత్యేక గుర్తులు, సంచిక సంఖ్యలతో నకిలీకి ఆస్కారం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.
రాష్ట్ర పునర్నిర్మాణం, శాంతిభద్రతల పరిరక్షణ, దేవాలయాల పవిత్రత కాపాడటం, అవినీతి ఆరోపణలపై చర్యలు తీసుకోవడం వంటి అంశాల్లో ప్రభుత్వం దృఢ సంకల్పంతో ముందుకు సాగుతుందని ముఖ్యమంత్రి తన ప్రసంగంలో పేర్కొన్నారు.

# స్కూళ్లు మరింత మెరుగుపడాలి

(మొదటి పేజీ (తరువాయి)

ఈ ప్రక్రియ అనంతరం సుమారు 40 శాతం ప్రభుత్వ పాఠశాలలు రెండు స్టార్ కంటే తక్కువ స్థాయిలో ఉన్నట్లు గుర్తించినట్లు మంత్రి వెల్లడించారు. ఈ వివరాలు ప్రభుత్వం దృష్టికి వచ్చిన వెంటనే అత్యవసర చర్యలు చేపట్టాలని నిర్ణయించామని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలల మౌలిక వసతులు అనేక చోట్ల తగిన స్థాయిలో లేవని అంగీకరించారు. 2020 నుంచి 2026 వరకు మనబడి నాడు-నేడు, మనబడి--మన భవిష్యత్ పథకాల కింద ఖర్చు చేసిన నిధులపై సభ్యులు వివరాలు కోరగా ప్రభుత్వం సమగ్ర లెక్కలు అందించినట్లు చెప్పారు. గత ప్రభుత్వ కాలంలో చేపట్టిన పనులకు సంబంధించిన అనేక బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, అవి సకాలంలో చెల్లించి ఉంటే పనులు నిలిచిపోవాల్సిన పరిస్థితి రాకపోయేదని వ్యాఖ్యానించారు. చిత్తశుద్ధి ఉంటే పెండింగ్ బిల్లులు ఎందుకు చెల్లించలేదని ప్రశ్నించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించిన తరువాత ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి కనీసం రూ.7,500 కోట్లు అవసరమని అంచనా వేశామని తెలిపారు. ముందుగా అత్యవసర అవసరాలను గుర్తించి దశలవారీగా పనులు చేపట్టాలని కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా లీక్ కాకుండా ఉండే భవనాలు నిర్మించడం, జర్జరిత గదులను మరమ్మతు చేయడం, ప్రతి విద్యార్థికి బెంచీ సదుపాయం కల్పించడం, తాగునీటి సౌకర్యం, పరిశుభ్రమైన మరుగుదొడ్లు అందించడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తామని వెల్లడించారు. చిత్తూరు జిల్లాలో పర్యటించినప్పుడు కొన్ని పాఠశాలల్లో పైకప్పులు లీక్ అవుతున్నాయి, గోడలు దెబ్బతిన్నాయి, పేయింటింగ్ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న దృశ్యాలు తనకు కనిపించాయని చెప్పారు. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రెండు స్టార్ కంటే తక్కువ రేటింగ్ పొందిన పాఠశాలలను ప్రాధాన్య క్రమంలో తీసుకుని ప్రత్యేక పర్యవేక్షణలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యతా ప్రమాణాలు పెంపు, విద్యార్థులకు భద్రమైన మరియు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. స్టార్ రేటింగ్ విధానం ద్వారా ప్రతి పాఠశాల స్థితిని పారదర్శకంగా ప్రజలకు తెలియజేస్తామని, లోపాలను సరిదిద్దుతూ విద్యా రంగాన్ని బలోపేతం చేస్తామని పేర్కొన్నారు..

# ఉచిత బస్సుకు మరింత పటిష్టత

(మొదటి పేజీ (తరువాయి)

వినియోగించుకుంటున్నారు. ప్రత్యేక పండుగలు, ఉత్సవాల సందర్భాల్లో నడిపే ప్రత్యేక బస్సుల్లో కూడా ఈ పథకం అమలు కొనసాగుతోంది. త్వరలో ఎలక్ట్రిక్ బస్సుల్లోనూ ఈ సౌకర్యాన్ని అమలు చేయాలనే యోచనలో ప్రభుత్వం ఉంది. ఈ నేపథ్యంలో ఉచిత ప్రయాణ పథకం అమలులో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు ఆర్టీసీ యాజమాన్యం కసరత్తు ప్రారంభించింది. ఆదాయ-వ్యయ సమతుల్యత, సర్వీసుల సమన్వయం, సాంకేతిక సదుపాయాల మెరుగుదల వంటి అంశాలపై దృష్టి సారిస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ తరువాత ప్రారంభ దశలో ఈ బాధ్యతలను ఐపీఎస్ అధికారి ద్వారకా తిరుమల రావు పర్యవేక్షించారు. అనంతరం తాత్కాలికంగా ఐఏఎస్ అధికారి ఎంటీ కృష్ణబాబుకు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం డీజీపీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న బాల సుబ్రమణ్యం కు పూర్తి స్థాయి బాధ్యతలు కేటాయిస్తూ తాజా ఉత్తర్వులు జారీ అయ్యాయి.
బాల సుబ్రమణ్యం 2014 నుంచి 2019 మధ్య కాలంలో చంద్రబాబు ప్రభుత్వంలో రవాణా శాఖను పర్యవేక్షించిన అనుభవం కలిగి ఉన్నారు. పోలీసు శాఖలో వివిధ హోదాల్లో, అనేక ప్రాంతాల్లో సేవలందించారు. పరిపాలనలో క్రమశిక్షణ, అమలు సామర్థ్యం ఉన్న అధికారిగా గుర్తింపు పొందారు.
ప్రజారవాణా వ్యవస్థను రాష్ట్ర అభివృద్ధికి కీలకంగా భావిస్తున్న ప్రభుత్వం, ఉచిత బస్సు పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో అనుభవజ్ఞుడైన అధికారిని ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. తాజా ఉత్తర్వుల మేరకు బాల సుబ్రమణ్యం త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ నియామకం ద్వారా ఆర్టీసీ సేవలు మరింత పటిష్ఠంగా మారనున్నాయని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి.

# 2029 లక్ష్యం

(మొదటి పేజీ (తరువాయి)



నిర్వహిస్తున్న ఆయన, ప్రతి నియోజకవర్గంలో ఎమ్మెల్యే పనితీరు, పార్టీ బలాబలాలు, తాజా సర్వే నివేదికల ఆధారంగా కార్యాచరణ ఖరారు చేస్తున్నారు. నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ, ఇన్‌చార్జ్ మంత్రులతో సమావేశాలు జరిపి ఒక్కొక్కరి ప్రోగ్రెస్ రిపోర్టులను సిద్ధం చేయించారు. మచిలీపట్నం లోక్‌సభ పరిధిలోని నాయకులతో క్షేత్ర స్థాయి నివేదికలను చర్చించి వారికి రోడ్ మ్యాప్‌ను ఖరారు చేశారు. ఎమ్మెల్యేల పనితీరుపై నివేదికలను సీల్డ్ కవర్లలో అందజేయడం విశేషం. మచిలీపట్నం లోక్‌సభ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో పామర్రు, పెనమలూరు, గుడివాడ నియోజకవర్గాల పనితీరు బాగుందని సంతృప్తి వ్యక్తమైంది. మచిలీపట్నం, గన్నవరం, పెడన నియోజకవర్గాల్లో పనితీరు ఆశించిన స్థాయిలో లేదని గుర్తించి మరింత శ్రమించాలని సూచించారు. అవనిగడ్డ నియోజకవర్గంలో కూటమి పార్టీల మధ్య సమన్వయం లోపించిందని పేర్కొంటూ వెంటనే సరిదిద్దుకోవాలని సూచించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పార్టీ మారిన తర్వాత స్థానిక స్థాయిలో సమన్వయం సరిగా లేకపోవడం గమనార్హమని వ్యాఖ్యానించారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వాసంశెట్టి సుభాష్ జిల్లాలో ఎమ్మెల్యేలకు అందుబాటులో ఉండడం లేదని, తరచుగా పర్యటనలు చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. ఇకపై పని తీరు మారాలని స్పష్టం చేశారు. కలెక్టర్ పనితీరు సంతృప్తికరంగా ఉందని ఎమ్మెల్యేలు అభిప్రాయపడ్డారు. ఎస్పీ పనితీరుపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. రాజకీయంగా గన్నవరం నుంచి వల్లభనేని వంశీ, గుడివాడ నుంచి కొడాలి నాని తిరిగి పోటీ చేసే అవకాశాలపై పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. గత ఎన్నికల్లో వీరిద్దరినీ ఓడించిన అనుభవంతో అదే ఫలితాన్ని పునరావృతం చేయాలనే పట్టుదలతో పార్టీ నాయకత్వం వ్యూహాలు రచిస్తోంది. దీంతో గుడివాడ, గన్నవరం నియోజకవర్గాల్లో రానున్న రోజుల్లో రాజకీయ పరిణామాలు మరింత ఆసక్తికరంగా మారనున్నాయి.

# రష్యానుంచి క్షిపణుల కొనుగోలు

## రూ 10వేల కోట్ల ఒప్పందానికి గ్రీన్‌సిగ్నల్
## మరింత పటిష్టం కానున్న భారత రక్షణ శాఖ



**న్యూ ఢిల్లీ (తెలుగోడు),ఫిబ్రవరి 13 :** భారత రక్షణరంగ పటిష్టత దిశగా మరో కీలక ముందడుగు పడింది. రష్యా నుంచి 288 ఎస్-400 క్షిపణుల కొనుగోలుకు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో డిఫన్స్ అక్విజిషన్ కౌన్సిల్ సుమారు రూ.10,000 కోట్ల ఒప్పందానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఫాస్ట్ ట్రాక్ పద్ధతిలో జరిగే ఈ కొనుగోళ్లలో 120 స్వల్ప శ్రేణి క్షిపణలు, 168 సుదీర్ఘ శ్రేణి క్షిపణలు ఉన్నాయి. ఇప్పటికే కాంట్రాక్ట్ జరిగిన మరో రెండు ఎస్-400 వ్యవస్థలు ఈ ఏడాది జూన్, నవంబర్‌లో భారత్‌కు అందనున్నాయి. ఆపరేషన్ సిందూర్' సమయంలో ఉపయోగించిన క్షిపణుల నిల్వలను పునరుద్ధరించడం, వాయి రక్షణ సామర్థ్యాన్ని పెంచుకోవడం తాజా కొనుగోళ్ల ముఖ్య ఉద్దేశంగా డిఫెన్స్ వర్గాలు తెలిపాయి. ఇదేవిధంగా చైనా, పాకిస్థాన్ సరిహద్దుల వద్ద భారత వాయు రక్షణ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని, 400 కిలోమీటర్ల పరిధిలో వైమానిక ముప్పును సమర్థవంతంగా ఎస్-400 వ్యవస్థ అడ్డుకుంటుందని పేర్కొన్నాయి. పాకిస్థాన్‌తో గత ఏడాది తలెత్తిన ఉద్రిక్తతలు, ఆపరేషన్ సిందూర్ సమయంలో ఎస్-400 వ్యవస్థ శత్రువుల వెన్నులో చలిపుట్టించింది. 314 కిలోమీటర్ల దూరంలోని పాక్ యుద్ధ విమానాన్ని కుప్పకూల్చింది. ఆదంపూర్, భుజ్ సెక్టార్లలో ఈ వ్యవస్థను మోహరించడంతో పాక్ గత్యంతరం లేని పరిస్థితుల్లో తమ యుద్ధ విమానాలను ఆఫ్ఘనిస్థాన్, ఇరాన్ సరిహద్దులకు తరలించాల్సి వచ్చింది. ప్రస్తుతం కొనుగోలు చేయనున్న 400 కి.మీ, 200 కి.మీ, 150 కి.మీ, 40 కిలోమీటర్ల శ్రేణి క్షిపణులు శత్రువుల విమానాలు, డ్రోన్ దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టగలవు.

# ఇదీ అసలు నిజం

(మొదటి పేజీ (తరువాయి)

పంపిన ఆ ట్యాంకర్లు జూలై 27న శ్రీకాళహస్తి సమీపంలో మరో డెయిరీ వద్ద నిలిపివేయబడ్డాయని పేర్కొన్నారు. అనంతరం ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో అదే ట్యాంకర్లు వేరే డెయిరీ పేరుతో తిరిగి టీటీడీకి చేరాయని ఆరోపించారు. ఆ నెయ్యి వినియోగంలోకి వచ్చినట్లు సీబీఐ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లో ప్రస్తావించబడిందని తెలిపారు. జరిగిన తేదీలు, పరిణామాల క్రమం పరిశీలిస్తే ప్రభుత్వం మారిన తర్వాతే ఈ సంఘటనలు చోటుచేసుకున్నాయని వివరించారు. 2014 నుంచి 2019 మధ్య ప్రీమియర్ డెయిరీ నెయ్యి సరఫరా చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అదే సంస్థపై ప్రస్తుతం అభియోగాలు ఉన్నప్పటికీ, గత సరఫరాల విషయాన్ని ప్రస్తావించకుండా కేవలం తమ ప్రభుత్వానికే బాధ్యతను మోపడం తగదని పేర్కొన్నారు. 2016, 2017, 2018 సంవత్సరాల్లో కూడా ఆ సంస్థ టీటీడీకి నెయ్యి సరఫరా చేసిందని తెలిపారు. అప్పటి సరఫరాలపై ఎటువంటి చర్చ జరగకపోవడం రాజకీయ ఉద్దేశ్యాన్ని సూచిస్తోందని వ్యాఖ్యానించారు. టీటీడీలో నెయ్యి సేకరణకు కఠినమైన విధానం అమలులో ఉందని వివరించారు. కేంద్ర ప్రభుత్వం గుర్తింపు పొందిన ప్రయోగశాల నుంచి ధ్రువీకరణ పత్రం లేకుండా ట్యాంకర్లను అనుమతించరని చెప్పారు. టీటీడీ స్వయంగా కూడా నమూనాలను పరీక్షిస్తుందని, రెండు పరీక్షల్లోనూ అనుకూల నివేదిక వచ్చినప్పుడే వినియోగానికి అనుమతి ఇస్తారని వెల్లడించారు. తమ పాలనలో నాణ్యత లోపాల కారణంగా 18 సార్లు ట్యాంకర్లు తిరస్కరించబడినట్లు తెలిపారు. అంతకు ముందు 2014-19 మధ్య కాలంలో కూడా 15 ట్యాంకర్లు తిరస్కరించబడిన విషయాన్ని గుర్తు చేశారు. లడ్డూ వ్యవహారాన్ని రాజకీయ ఆరోపణల కంటే వాస్తవాల ఆధారంగా పరిశీలించాలని పార్టీ నేతలకు సూచించారు. జరిగిన పరిణామాలపై పూర్తి నిజాలను ప్రజల ముందుంచాలని పిలుపునిచ్చారు.

# ఆకలికి మతం లేదు

(మొదటి పేజీ (తరువాయి)

గౌరవాన్ని దెబ్బతీయడం సరైంది కాదని నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై రాజకీయ వర్గాల్లోనూ స్పందన వ్యక్తమైంది. ముఖ్యంగా ధర్మవరం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ స్పందించిన తీరు ప్రాధాన్యం సంతరించుకుంది. సోషల్ మీడియాలో ఆయన చేసిన వ్యాఖ్యలు విస్తృతంగా పంచుకుంటున్నారు. "ఆకలికి మతం ఉండదు... ఆత్మగౌరవానికి మతం ఉండదు. కష్టపడి పని చేసి కుటుంబాన్ని పోషించుకునే ప్రతి ఒక్కరినీ గౌరవించాల్సిన బాధ్యత అందరిదీ. ఒక కోవా బన్ అమ్ముకునే పేద వ్యాపారి జీవితాన్ని ఇలా రోడ్డుపైకి లాగడం దారుణం. యూట్యూబ్ వ్యూస్ కోసం ఇలాంటి పనులు చేయడం తగదు. పేదల పక్షాన నిలబడాలి గానీ గొంతు నొక్కడం కాదు" అంటూ ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. పరిటాల శ్రీరామ్ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విస్తృత చర్చకు దారితీశాయి. పేదల ఆత్మగౌరవాన్ని కాపాడాల్సిన అవసరాన్ని ఆయన స్పష్టంగా ప్రస్తావించారని అనేక మంది అభిప్రాయపడుతున్నారు. వలీకి వస్తున్న మద్దతు మానవత్వం ఇంకా సజీవంగా ఉందని సూచిస్తోందని, చిన్న వ్యాపారుల శ్రమను గౌరవించడం సమాజం బాధ్యతేనని పలువురు పేర్కొంటున్నారు.

# 15 ఆదివారమే శివరాత్రి

**శ్రీశైలం (తెలుగోడు),ఫిబ్రవరి 13 :**



పరమ శివుడి పవిత్రమైన పర్వదినం మహా శివరాత్రి. మహా శివరాత్రి రోజు ఉపవాసంతో జాగారం చేస్తే ఎంతో పుణ్యంగా భావిస్తారు హిందూవులు. ఈ ఏడాది పండుగ ఏ రోజు వచ్చింది.. 15వ తేదీనా.. 16వ తేదీనా.. ఆదివారమా.. సోమవారమా అనే సందేహం చాలా మందిలో వ్యక్తం అవుతుంది. అందరూ 15వ తేదీనే మహారాత్రి అంటున్నా.. కొందరు మాత్రం 16వ తేదీ కదా అనే సందేహం వ్యక్తం చేస్తున్నారు. హిందూ మతంలో అత్యంత పవిత్ర పండుగల్లో ఒకటి అయిన మహాశివరాత్రి ఫిబ్రవరి 15వ తేదీ నాడు జరుపుకోవాలని పండితులు నిర్ణయించారు. చతుర్దశి తిథి ప్రారంభం: ఫిబ్రవరి 15 సాయంత్రం 5:04 గంటలకు ప్రారంభమై, తిథి ముగింపు: ఫిబ్రవరి 16 సాయంత్రం 5:34 గంటల వరకు ఉంటుంది. నిషిత కాల ముహూర్తం : ఫిబ్రవరి 15 12:09 నుండి 1:01 ఉంటుంది. హిందూ పండుగలను సాధారణంగా ఉదయ తిథి ..సూర్యోదయం.. ఆధారంగా జరుపుకున్నప్పటికీ, నిషిత కాలంలో చతుర్దశి వచ్చే రోజున మహాశివరాత్రిని జరుపుకుంటారు. ఈ నియమం ఆధారంగా, మహాశివరాత్రిని ఫిబ్రవరి 15న జరుపుకుంటారు. మహాశివరాత్రి రోజు అభిషేకం చేసేందుకు శుభ ముహూర్త సమయాలు మహాశివరాత్రి రోజు రాత్రి శివుని పూజకు అత్యంత పవిత్రమైన సమయం నిషిత కాలం అని పండితులు సూచిస్తున్నారు.

# పుట్టపర్తి అభివృద్ధికి అంకిత భావంతో వినతి

## గ్రామీణ రహదారులు, వంతెనల నిర్మాణానికి నిధులకై పవన్ కళ్యాణ్‌కు ఎమ్మెల్యే సింధూర అభ్యర్థన

**పుట్టపర్తి (తెలుగోడు),ఫిబ్రవరి 13 :** శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కీలక చర్యలు చేపట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో దెబ్బతిన్న రహదారులు, వంతెనల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లుతూ డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ప్రత్యేకంగా లేఖ అందజేశారు. నియోజక వర్గంలోని పలు మండలాల్లో అత్యవసరంగా చేపట్టాల్సిన మౌలిక వసతుల పనులపై వివరంగా తెలియజేసి తగిన నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఓడిచెరువు మండలం సున్నంపల్లి గ్రామం వద్ద సోమావతి నదిపై ఉన్న వంతెన నాలుగేళ్ల క్రితం వర్షాలకు దెబ్బతిని తెగిపోవడంతో గ్రామాల మధ్య రాకపోకలు తీవ్రంగా ప్రభావితమయ్యాయని ఆమె వివరించారు. ఈ వంతెన పునర్నిర్మాణానికి రూ.3 కోట్లు 90 లక్షలు మంజూరు చేస్తే ప్రజలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. అలాగే కొత్తచెరువు మండలం గోరంట్లపల్లి వద్ద చిత్రావతి నదిపై రహదారి, వంతెన నిర్మాణం అవసరమని పేర్కొంటూ రూ.4 కోట్లు మంజూరు చేయాలని కోరారు. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని రాయలవారిపల్లి గ్రామానికి వెళ్లే చిత్రావతి నదిపై నిర్మించిన వంతెన కూడా భారీ వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్నదని గుర్తుచేశారు. ఈ వంతెన పునర్నిర్మాణానికి రూ.4 కోట్లు 20 లక్షలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. నల్లమాడ మండలం కొత్తపల్లి తండా నుంచి గంగమ్మ ఆలయం వరకు రహదారి నిర్మాణానికి రూ.90 లక్షలు మంజూరు చేస్తే స్థానిక ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు మెరుగుపడితేనే విద్యార్థులు పాఠశాలలకు, రైతులు మార్కెట్లకు, ప్రజలు వైద్యసేవలకు సులభంగా చేరుకోగలరని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి స్పష్టం చేశారు.



ప్రపంచ ప్రఖ్యాతి తాంచిన శ్రీ సత్యసాయి నిలయమైన పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వం తక్షణమే స్పందించి అవసరమైన నిధులు విడుదల చేయాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పవన్ కళ్యాన్‌కు విజ్ఞప్తి చేశారు.



ప్రొఫెసర్‌కు సన్మానం చేస్తున్న దృశ్యం

## విద్యతో పాటు ప్రాయోగిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

**అనంతపురం కల్చరల్ (తెలుగోడు), ఫిబ్రవరి 13 :**
నగరంలోని ఎస్ఎస్‌బిఎన్ డిగ్రీ కాలేజీలో కెరీర్ డెవలప్మెంట్ సెల్ ఆధ్వర్యంలో మానవ గుండె వైఫల్యం–పరమాణు ఆధారం అన్న అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డా. జి. సరిత తెలిపారు. ఈ కార్యక్రమంలో బెంగుళూరు ఐఐఎస్‌కు చెందిన ప్రొఫెసర్ రవి సుందరేశన్ మాట్లాడుతూ గుండె వైఫల్యం, గుండె వైఫల్యం రకాలు, జీవనశైలి మార్పులతో రోజువారీ మార్పులలో గుండె వైఫల్యాన్ని ఎలా నివారించాలో తెలిపారు.. గుండె వ్యాధులను అధిగమించడానికి యోగా, శారీరక దృఢత్వం యొక్క ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు విద్యతో పాటు ప్రాయోగిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



మండల స్థాయి ప్రేరణ ఉత్సవ్ పోటీలు నిర్వహిస్తున్న ఎంఈఓలు గోవిందరాజులు, హరికృష్ణ..

## విద్యార్థులకు ప్రేరణ ఉత్సవ్ మండల స్థాయి పోటీలు

**బెళగుప్ప (తెలుగోడు), ఫిబ్రవరి 13 :**
బెళుగుప్ప విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం విద్యార్థులకు ప్రేరణ ఉత్సవ్ మండల స్థాయి పోటీలు నిర్వహించారు. ఎంఈఓ -1 గోవిందరాజులు, ఎంఈఓ- 2 హరికృష్ణ పర్యవేక్షణలో మండల స్థాయి ప్రేరణ ఉత్సవ్ పోటీలు నిర్వహించారు. మండల పరిధిలోని వివిధ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8,9 తరగతులు చదివే విద్యార్థులు ప్రేరణ ఉత్సవ్ లో రిజిస్టర్ చేసుకున్న విద్యార్థులు పాల్గొన్నారు. ఈ ప్రేరణ ఉత్సవ పోటీలలో వ్యాసరచన, పద్య పఠనం, చిత్రలేఖనం,కథలు వ్రాయుట, క్యారీ కేచర్ (వ్యంగ చిత్రాలు) విభాగాలలో విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వానికి అభినందనలు

*108 అంబులెన్స్ సర్వీస్ ఉద్యోగులు ..*

**యాడికి (తెలుగోడు), ఫిబ్రవరి 13 :**
108 అంబులెన్స్ సర్వీస్‌లో ఉద్యోగులుగా పనిచేస్తున్న ఈ.యం.టి, పైలెట్‌లకు ముఖ్యమంత్రి .నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అప్పటికే ఉన్న ఉద్యోగి యొక్క జీతానికి అదనంగా ఉద్యోగికి నెలకు 2000 రూపాయలను పెంచడంతో పాటు, 5, 10 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకొన్న ఉద్యోగులకు ఆటోమేటిక్ స్లాబ్ అప్గ్రేడేషన్ చేయవలెనని నిర్ణయించడం ద్వారా వారికి మరింత ఆర్థిక వెసులుబాటును అందించారు. 108 అంబులెన్స్ ఉద్యోగులకు అందించిన ఆర్థిక పెంపుదలను ఉద్యోగులు అయిన ఈ.యం.టి మరియు పైలెట్లు అందరూ హర్షిస్తున్నారు. ఈనెల నుండి స్లాబ్ అప్గ్రేడ్ చేసిన జీతాలు చేతికి అందడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు అందరూ ఆంధ్రప్రదేశ్ 108 సర్వీస్లో ఏకైక సంఘం అయిన ఏపీ 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ (ఎ-138 జుఖ అనుబంధం)ఉద్యోగ సంఘం ద్వారా థ్యాంకూ సీఎం సార్ , థ్యాంకూ భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ పాంప్లేట్ లను విధులు నిర్వహించే వాహనం ముందు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా మేము చేస్తున్న విధినిర్వహణలో మరింత మెరుగైన సేవలు ఆపదలో ఉన్నవారికి అందించి ప్రభుత్వానికి మరియు భవ్య కంపెనీ వారికి మంచి పేరును తీసుకువస్తామని సిబ్బంది తెలిపారు.




రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్న యాడికిలో 108 సిబ్బంది

# మరకత లింగ దర్శనం.. పుణ్యప్రదం..సర్వపాపహరణం...

### రేపు శ్రీ రామేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు.. శ్రీ పార్వతీ పరమేశ్వరుల కళ్యాణోత్సవం..

**బెళగుప్ప (తెలుగోడు), ఫిబ్రవరి 13 :**
కష్టాల్లో ఉన్న భక్తులు భక్తిశ్రద్ధలతో మరకత లింగ శ్రీ రామేశ్వర స్వామిని దర్శించుకుంటే పుణ్య ప్రదం, సర్వ పాపహరణం కలుగుతుందని ఇక్కడి భక్తుల విశ్వాసం. మండల కేంద్రమైన బెళుగుప్ప లో వెలసిన శ్రీ రామేశ్వరస్వామి ఆలయంలో కొలువైన శ్రీ రామేశ్వర లింగం నవరత్నములలో ఒకటైన మరకతముతో నిర్మించబడినది ఇంత పెద్ద పరిణామములు ప్రతిష్టింపబడిన మహిమాన్విత మరకత లింగం దక్షిణ భారతదేశంలోని అపురూపం శ్రీ రామేశ్వర స్వామి మరకత లింగమును 11వ శతాబ్దంలో కులోత్తుంగ చోళుని కాలమున తపోశక్తి సంపన్నులైన మునుల శక్తిపాతములచే ప్రతిష్టింపబడినది. ఈ దివ్య లింగము అనన్య సామాన్యమై మహాశక్తి సమన్వితమై భక్తుల కోరికలను తీర్చే తేజోమయమైరాజిల్లుచున్నది. ఈ పవిత్ర మరకత లింగము నుండి వెడలిన శక్తిపుంజములు సోకిన యెడల అనేక శారీరక, మానసిక రోగములు నయమగునని, సత్సంతాన ప్రాప్తి, సకల అభీష్ట సిద్ధి కలుగునని స్వామిని సేవించిన వారు, భక్తి జ్ఞాన వైరాగ్యములతో ఆత్మజ్ఞానము పొంది మోక్ష ప్రాప్తికి అర్హులగుదురని ప్రతీతి.



స్వామివారి ఆలయం



మరకత లింగ శ్రీ రామేశ్వర స్వామి

**రేపు శ్రీ పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం....**

బెళుగుప్ప మరకత లింగ శ్రీ రామేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా రేపు ఆదివారం ఉదయం పుణ్యాహవాచనాధి కార్యక్రమాలు, పంచామృతాభిషేకం రుద్రాభిషేకం బిల్వార్చన నైవేద్యం మహా మంగళహారతి అనంతరం శ్రీ శివపార్వతుల కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.
శివపార్వతుల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్ లో ఉంచి గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించబడునని కార్యనిర్వాహకులు తెలిపారు.



నందీశ్వరుడు



పల్లకిలో ఊరేగుతున్న జ్యోతిర్లింగం

## జ్యోతిర్లింగ రూపంలో దర్శనమిచ్చిన కైలాసనాథులు

**అనంతపురం కల్చరల్ (తెలుగోడు), ఫిబ్రవరి 13 :**
ప్రజాపతి బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శివరాత్రి వేడుకలను ఘనంగా ప్రారంభించారు. పాత ఊరులోని చెన్నకేశవ ఆలయం నుండి జ్యోతిర్లింగాలను వెండి రథం, కార్ల పై ఏర్పాటుచేసి ఊరేగించారు. మహిళలు హారతులతో ఊరేగింపుగా నిర్వహించిన శాంతియాత్ర కన్నుల పండువగా సాగింది. ఈ సందర్భంగా బ్రహ్మకుమారి శారద ప్రసంగిస్తూ శివరాత్రి మహోత్సవాలు మూడు రోజులపాటు నిర్వహిస్తున్నామని, మొదటిరోజు జ్యోతిర్లింగాలను పుర ప్రజలకు దర్శన భాగ్యం కలగజేసేలా చేశామన్నారు. ప్రతి ఒక్కరూ పరమేశ్వరునిపై ధ్యాస ఉంచి భక్తి మార్గంలో నడవాలని అన్నారు



కైలాస పర్వతంపై ఆసీనులైన భోళాశంకరుడు

## కైలాస పర్వతంపై ఆశీనులైన శివపార్వతులు

**అనంతపురం కల్చరల్ (తెలుగోడు), ఫిబ్రవరి 13 :**
శివరాత్రి మహోత్సవాలలో భాగంగా ఒకటో రోడ్డు లోని శ్రీ కాశీ విశ్వేశ్వర కోదండ రామాలయంలో కైలాస పర్వతంపై ఆదిదంపతులు ఆసీనులై భక్తులకు దర్శన భాగ్యం కలగజేశారు. ఉదయం ఆలయంలో విశేష పూజలను నిర్వహించారు. సాయంత్రం శివపార్వతులు వివిధ పుష్ప మాలలతో బంగారు ఆభరణాలతో అలంకరించుకొని కైలాస పర్వతముపై ఆశీనులు కాగా పుర ప్రజలు దంపతులను దర్శించుకుని పునీతులయ్యారు. ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. కార్యక్రమంలో ఆలయం కార్యనిర్వహణ అధికారి నాగేంద్రుడు, చైర్మన్ నరేంద్ర చౌదరి లతోపాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు .

# 22న చలో మంగళగిరి చేనేత గర్జన జయప్రదం చేయండి

### చేనేత రాష్ట్ర ఉపాధ్యక్షుడు నీలూరు లక్ష్మయ్య..

**యాడికి (తెలుగోడు), ఫిబ్రవరి 13 :**
22న చలో మంగళగిరి చేనేత గర్జన జయప్రదం చేయాలని చేనేత రాష్ట్ర ఉపాధ్యక్షుడు నీలూరు లక్ష్మయ్య పిలుపునిచ్చారు. యాడికి మండల కేంద్రంలోని మార్కండేయ స్వామి ఆలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నీలూరు లక్ష్మయ్య ఆధ్వర్యంలో చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేతలకు రాష్ట్ర బడ్జెట్లో 2000 కోట్ల రూపాయలు కేటాయించాలని, నేతన్న నేస్తం 25 వేల రూపాయలు ఇవ్వాలని, చేనేతలకు ఉచిత విద్యుతు 200 యూనిట్లు అమలు చేయాలని, ముడి పట్టు 50 శాతం రాయితీతో ఇవ్వాలని, ఆదరణ పథకం కింద చేనేతలకి 90 శాతం సబ్సిడీతో ఆధునిక మగ్గం పరికరాలను ఇవ్వాలని, చేనేత మహిళలకు ప్రసూతి సమయంలో ఆరు నెలలపాటు నెలకు 5000 రూపాయలు ఇవ్వాలని, ఇల్లు లేని చేనేతలకు మూడు సెంట్లు స్థలం కేటాయించాలని, చేనేతలకు వర్క్ షెడ్డు నిర్మాణానికి 5 లక్షల రూపాయలు కేటాయించాలని, 50 సంవత్సరాలు దాటిన చేనేత కార్మికులకు ప్రతి ఒక్కరికి పింఛన్ మంజూరు చేయాలని, చేనేతపై జిఎస్టిని పూర్తిగా రద్దు చేయాలని, చేనేత కార్మికులు తయారుచేసిన వస్త్రాలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, చేనేత కార్మికులకు ముద్ర రుణాలు ఐదు లక్షల రూపాయలు 50 శాతం సబ్సిడీతో ఇవ్వాలని, చేనేత 11 రకాల 1985 రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలని, ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికుల కుటుంబాలకు 10 లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా, వారి పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. 22న చలో మంగళగిరి చేనేత గర్జన జయప్రదం తరలి రావాలని చేనేత నాయకులు పిలుపునిచ్చారు అనంతరం పోస్టర్ విడుదల చేశారు.




చలో మంగళగిరి చేనేత గర్జన పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పామిశెట్టి గోవిందు, జాతీయ చేనేత ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ మామిళ్ళ నారాయణస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ సోమశేఖర్, పట్టు చీరలు ఉత్పత్తిదారులు పళ్ళ చితంబరి, పులిచెర్ల శ్రీనివాసులు, లింగం చంద్రశేఖర్ , పురుషోత్తం. చేనేత కార్మికులు పుట్లూరు నరసింహయ్య, రంగం ఓబులయ్య, పులికొండ రామరాజు, పామిశెట్టి జయరాముడు, ఉడుముల సంజీవులు, చింతా నాగేశ్వరయ్య, అచ్చుకట్ల హాజీ ఫిరా , సోమశేఖర్, పెద్దకోట్ల శ్రీనివాసులు, కోదండరావ్ ,జానపాటి స్వామి, పోసా చోడయ్య తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో తాగునీటి సమస్య పరిష్కరించండి

*అసెంబ్లీలో ఎమ్మెల్యే పరిటాల సునీత..*

**రాప్తాడు (తెలుగోడు), ఫిబ్రవరి 13 :**
రాప్తాడు నియోజకవర్గంలో తాగునీటి సమస్యపై ఎమ్మెల్యే పరిటాల సునీత అసెంబ్లీలో తన వాణి వినిపించారు. ప్రస్తుతం బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో జీరో అవర్ లో ఎమ్మెల్యే సునీత అనంతపురం రూరల్, ఆత్మకూరు మండలాల్లో నెలకొన్న తాగునీటి సమస్య గురించి ప్రస్తావించారు. 2మండలాల్లో సుమారు 50గ్రామాల్లో త్రాగునీటి సమస్య ఉందన్నారు. అనంతపురం రూరల్ మండలం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో జనాభాకు ఇప్పుడు వస్తున్న నీరు సరిపోవడం లేదన్నారు. అందుకే ప్రభుత్వం 90కోట్ల జల జీవన్ మిషన్ నిధులతో పీఏబిఆర్ నుంచి తాగునీటి పైప్ లైన్, ట్యాంకుల నిర్మాణాలు చేపట్టారన్నారు. మెయిన్ పైప్ లైన్ అనంతపురం వరకు పూర్తి అయిందని.. ఇంకా కొంతవరకు పనులు చేయాల్సి ఉందన్నారు.



# డ్రగ్స్, బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన

### ఏఎస్ఐ.విజయ గౌరీ..

**యాడికి (తెలుగోడు), ఫిబ్రవరి 13 :**
డ్రగ్స్, బాల్య వివాహాలపై విద్యార్థులకు ఏఎస్ఐ విజయ్ గౌరీ అవగాహన కల్పించారు. యాడికి మండలంలోని ప్రభుత్వ పాఠశాల నంబర్ -4, రాయల చెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఏఎస్ఐ విజయ్ గౌరీ మాట్లాడుతూ మత్తు పదార్థాలు డ్రగ్స్ వద్దు చదివే ముద్దు, బాల్య వివాహాలు వద్దు చదివే ముద్దు అంటూ అవగాహన కలిగించారు.



పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు డ్రగ్స్ బాల్య వివాహాలపై శక్తి యాప్‌పై అవగాహన కలిగిస్తున్న ఏఎస్ఐ విజయ్ గౌరీ



పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు డ్రగ్స్ బాల్య వివాహాలపై శక్తి యాప్‌పై అవగాహన కలిగిస్తున్న ఏఎస్ఐ విజయ్ గౌరీ

శక్తి యాప్ ద్వారా ఏమైనా ప్రమాదాల్లో ఉన్న సమయంలో శక్తి యాప్ ద్వారా మీరు ఉన్న ప్రదేశం లొకేషన్‌లో తెలుసుకొని వెంటనే పోలీసులు ఆ ప్రదేశానికి వచ్చి మీకు రక్షణ కలిగిస్తారన్నారు. ప్రతి ఒక్కరూ శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. మంచి స్పర్శ చెడు స్పర్శ మధ్య తేడాలను వివరించారు. మీ రక్ష నే మా బాధ్యత మంచి అలవాట్లకు వెళ్లండి, చెడు అలవాటుకు వెళ్లి డ్రగ్స్, గుట్కా మద్యం చెడు అలవాటకు బానిసై జీవితాలు నాశనం చేసుకోవద్దు అన్నారు. వాటి వలన జరిగే నష్టాలను వివరించారు. బాల్య వివాహాలు జరిపితే చట్టరిత్త నేరమని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

# 15లోగా ఇంటి, కుళాయి పన్ను వసూళ్లు 100 శాతం పూర్తి చేయాలి

### డిఎల్‌డిఓ. విజయలక్ష్మి..

**యాడికి (తెలుగోడు), ఫిబ్రవరి 13 :**
యాడికి మండలంలోని 14 పంచాయితీల గ్రామ ప్రజలు ఈనెల 15వ తేదీ లోగా ఇంటి పన్ను కోలాయి పన్నులు 100 శాతం చెల్లించాలని డిఎల్‌డిఓ విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం యాడికి ఎంపీడీవో కార్యాలయంలో యాడికి పంచాయతీ బిల్ కలెక్టర్ లతో సమావేశం ఏర్పాటు చేసి ఈనెల 15 వ తేదీ ఆదివారం లోక ఇంటి పండు కోలాయి పన్నులు 100% పూర్తి చేయాలని పంచాయతీ బిల్ కలెక్టర్లకు తెలిపారు. యాడికి మండలంలోని ఆయా గ్రామా పంచాయతీ లోని గ్రామ ప్రజలు పంచాయితీలకు చెల్లించాల్సిన



యాడికి ఎంపీడీవో కార్యాలయంలో ఇంటిపన్ను వసూళ్లపై బిల్ కలెక్టర్లతో మాట్లాడుతున్న డి ఎల్ డి ఓ విజయలక్ష్మి

ఇంటి పన్ను కోలాయి పన్నులు ఈనెల 15లోగా చెల్లించాలని చెల్లించని యెడల అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. ప్రధానంగా యాడికి మేజర్ పంచాయితీ పన్ను వసూలు చాలా పెండింగ్లో ఉన్నాయని ప్రజలు పంచాయతీ బిల్ కలెక్టర్ లు వచ్చిన ఎడల వెంటనే బిల్లు చెల్లించాలని పంచాయతీ సిబ్బంది వచ్చిన వెంటనే ఇంటి పన్ను కోలాయ పనులు చెల్లించి గ్రామపంచాయతీకు సహకరించాలని ప్రజలకు డి ఎల్ డి వో విజయలక్ష్మి సిబ్బందికి సూచించారు.
అనంతరం సచివాలయం నంబర్ 4 నందు డి ఎల్ డి ఓ విజయలక్ష్మి అకస్మాత్తుగా తనిఖీలు చేశారు. ఈ కార్యక్రమంలో డి ఎల్ డి ఓ విజయలక్ష్మితోపాటు ఎంపీడీవో వీర రాజు. డిప్యూటీ ఎంపీడీవో శశికళ బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు .




యాడికి సచివాలయం -4లో రికార్డులు తనిఖీ చేస్తున్న డి ఎల్ డి ఓ విజయలక్ష్మి. డిప్యూటీ ఎంపీడీవో శశికళ

# విద్యార్థులు జూనియర్ కళాశాలకు పేరు తేవాలి

### ప్రిన్సిపాల్ శంకర్ ప్రసాద్ ..

**పెద్దపప్పూరు (తెలుగోడు), ఫిబ్రవరి 13 :**
ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి జూనియర్ కళాశాలకు పేరు తేవాలని పెద్దపప్పూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ ప్రసాద్ సూచించారు. శుక్రవారం పెద్దపప్పూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సరస్వతి దేవి పూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలకు ఉన్న పేరు ప్రత్యాతుల దృష్ట్యా మీ వంతు కృషిగా ఉత్తమ ఫలితాలు సాధించి మరిం పేరు తీసుకురావాలన్నారు. ఉత్తమ ఫలితాలు సాధిస్తే ఇటు కళాశాలకు అటు తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలు తీరుతాయన్నారు. పరీక్ష సమయంలో ఎలాంటి ఒత్తిడికి గురికావద్దన్నారు. పరీక్షలు సమీపిస్తునడంతో ప్రతి ఒక్కరు ఫలితాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఉత్తమ ఫలితాలు సాధిస్తే చదువు బోధించిన అధ్యాపకులకు ఇటు కళాశాలకు మంచి పేరు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నరసయ్య, శశికళ, చంద్రకళ, అరుణ కుమారి, రాజేష్ బాబు, జాకీర్ హుస్సేన్, అంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.



సరస్వతి దేవి పూజకు హాజరైన కళాశాల విద్యార్థులు



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ ప్రసాద్

# దామోదరం సంజీవయ్య విగ్రహ ప్రతిష్ఠకు తరలిరండి

*బిజెపి అగళి మండలాధ్యక్షురాలు హెచ్ కె విక్టోరియా మహారాణి*

**అగళి (తెలుగోడు), ఫిబ్రవరి 13 :** మడకశిర పట్టణంలోని ఆర్డిఓ కార్యాలయం సర్కిల్ లో మడకశిర నియోజకవర్గ మాల మహానాడు సంఘం ఆధ్వర్యంలో శనివారం జరుగనున్న దళిత (మాల) మొట్టమొదటి ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ఉమ్మడి అనంతపురం జిల్లాలోని మాల సోదర సోదరీమణులు భారీగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతంచేయాలని బిజెపి అగళి మండలాధ్యక్షురాలు విక్టోరియా మహారాణి పిలుపునిచ్చారు. ముఖ్యంగా మడకశిర నియోజకవర్గంలోని అగళి, రొళ్ల,గుడిబండ, అమరాపురం,మడకశిర మండలాల్లోని మాల సోదర సోదరీమణులు ప్రతి ఒక్కరూతప్పకుండా హాజరుకావాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రి తొలి దళిత (మాల) ముఖ్యమంత్రిగా మాల సమాజానికి చెందిన వ్యక్తి దామోదరం సంజీవయ్య 38 ఏళ్ల అత్యంత చిన్న వయసులో 1960లోనే ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఘనత ఆయనది,అన్ని వర్గాల ప్రజలకు రిజర్వేషన్ అమలుతో పాటు ఉపాధ్యాయులు మరియు ఉద్యోగులకు పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టడంతో పాటు ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీల అభ్యున్నతి కోసం పాటుపడి అనేక సంస్కరణలను తీసుకువచ్చారని అన్నారు. అలాంటి మహనీయుడి విగ్రహం ప్రతిష్ఠించడం ఆనందదాయకమన్నారు ఈ ప్రతిష్టాపన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి మాల సోదరులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బిజెపి అగళి మండల అధ్యక్షురాలు హెచ్ కె విక్టోరియా మహారాణి కోరారు.





గృహప్రవేశంలో పాల్గొన్న సింగిల్ విండో అధ్యక్షులు గణేష్, మాజీ మండల్ కన్వీనర్ శివ రుద్రప్ప

# గృహప్రవేశానికి హాజరైన సింగిల్ విండో అధ్యక్షులు గణేష్

**అమరాపురం (తెలుగోడు), ఫిబ్రవరి 13 :** మండల పరిధిలో వీరప సముద్రం గ్రామంలో గవ్వప్పగారి సిద్దేశ్ గృహప్రవేశం పూజ కార్యక్రమంలో మండల సింగిల్ విండో అధ్యక్షులు గణేష్, మాజీ కన్వీనర్ శివ రుద్రప్ప వలస పంచాయతీ కన్వీనర్ బి.ఎస్. నాగరాజు టి. యన్. టి .యు. సి కార్యదర్శి మంజన్న, భీమరాజు, బసన్న, మూర్తి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

*ఎఈ నిజాముద్దీన్ ..*

**రొళ్ల (తెలుగోడు), ఫిబ్రవరి 13 :** రొళ్ల 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల కారణంగా వన్నారపల్లి, హెచ్‌ఎం పల్లి, రొళ్ల, గుడ్డ గురికి ఫీడర్ పరిధిలోని గ్రామాలకు శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎఈ నిజాముద్దీన్ తెలిపారు. ఈ ప్రాంతాలలో విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సంస్థతో సహకరించాలని కోరారు.



# ఆత్మహత్యకు పాల్పడిన వృద్ధుడి మృతి

**బత్తలపల్లి (తెలుగోడు), ఫిబ్రవరి 13 :** బత్తలపల్లి మండలం జలాలపురం గ్రామంలో విషాద ఘటన చోటు చేసుకుంది. దీర్ఘకాలంగా వేధిస్తున్న కాలు గాయం నయం కాకపోవడంతో మనోవేదనకు గురై పురుగుల మందు తాగిన తాటిచెర్ల లక్ష్మన్న (76) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం లక్ష్మన్నకు ఏడాదిన్నర క్రితం ఎడమ కాలి పాదంపై గాయం ఏర్పడి, అది క్రమంగా తీవ్రతరమైంది. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స తీసుకున్నప్పటికీ గాయం నయం కాకపోవడంతో నొప్పిని భరించలేక తీవ్ర మనోవేదనకు లోనయ్యేవారని తెలిపారు. ఈ నెల 10వ తేదీ రాత్రి 9 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆయన పురుగుల మందు తాగి అస్వస్థతకు గురికాగా, కుటుంబ సభ్యులు వెంటనే బత్తలపల్లిలోని ఆర్డిటి ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అదే రాత్రి అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు కుమారుడు జయపాల్ ఫిర్యాదు మేరకు బత్తలపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



మృతుడు తాటిచెర్ల లక్ష్మన్న

# భోజనం నాణ్యతలో రాజీపడొద్దు

**కేజీబీవీ పాఠశాల ఆకస్మిక తనిఖీ.. ప్రీ ఫైనల్ పరీక్షల పర్యవేక్షణ.. ఆహార పదార్థాల తనిఖీ .. సిబ్బంది హాజరు పరిశీలన.. జిసిడిఓ అనిత ..**



విద్యార్థినుల పరీక్షలను పర్యవేక్షిస్తున్న జిసిడిఓ అనిత

**నల్లమాడ (తెలుగోడు), ఫిబ్రవరి 13 :** కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులకు అందిస్తున్న భోజనం నాణ్యతలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడొద్దని జిల్లా జిసిడిఓ అనిత స్పష్టం చేశారు. శుక్రవారం నల్లమాడలోని పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన ఆమె పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. పరీక్షా నిర్వహణపై ఆరా తీశారు. అనంతరం స్కూల్ ఎస్.ఓ లక్ష్మితో సమావేశమై ప్రభుత్వం నుంచి విద్యార్థినిలకు అందుతున్న సౌకర్యాల అమలుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా భోజన పథకం అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యార్థినులకు భోజన రూపంలో ఇస్తున్న పాలు, గుడ్లు, కూరగాయలు, బియ్యం, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను స్వయంగా పరిశీలించారు. వంటశాల పరిశుభ్రత, నిల్వ విధానం, తాగునీటి సదుపాయాలపై ఆరా తీశారు.



స్టోర్ రూమ్‌ను తనిఖీ చేస్తున్న జిసిడిఓ అనిత

విద్యార్థినులకు ఉదయం అల్పాహారం సకాలంలో అందుతున్నదా, మధ్యాహ్న భోజనం వేడి వేడిగా వడ్డిస్తున్నారా అనే విషయాలను తెలుసుకున్నారు. మెనూ ప్రకారం ఆహారం అందించాల్సిన బాధ్యత సిబ్బందిదేనని స్పష్టం చేశారు. నాణ్యతలో లోపం ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాలలో పనిచేస్తున్న సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేసి విధుల్లో నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. విద్యార్థినుల ఆరోగ్యం, విద్యాభివృద్ధి ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని తెలిపారు.

పదవ తరగతి, ఇంటర్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు మరింత శ్రద్ధ చూపాలని సూచించారు. విద్యార్థినుల సంక్షేమం విషయంలో ఎలాంటి అలసత్వానికి తావులేదని, భోజన నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని జిసిడిఓ అనిత స్పష్టం చేశారు.

# ముందస్తు గుర్తింపుతో క్యాన్సర్‌కు సంపూర్ణ చికిత్స

**ఆర్డీటి ఆసుపత్రి,ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన..**

**బత్తలపల్లి (తెలుగోడు), ఫిబ్రవరి 13 :** క్యాన్సర్ అనేది నయం చేయలేని వ్యాధి కాదని, తొలి దశలో గుర్తిస్తే పూర్తిస్థాయిలో జయించవచ్చని బత్తలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అరుణ్ కుమార్, ఆర్డిటి మెడికల్ సూపరింటెండెంట్, వైద్యురాలు డాక్టర్ జ్యోతి పేర్కొన్నారు. అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం బత్తలపల్లిలో ఆర్డీటి ఆసుపత్రి, స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో విస్తృత అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్డిటి ఆసుపత్రి నుండి సాగిన ఈ ర్యాలీలో వైద్యులు, నర్సింగ్ విద్యార్థులు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొని క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. నేను క్యాన్సర్‌ను నివారించగలను.. మీరు కూడా నివారించగలరా అనే నినాదంతో ప్రజలను చైతన్యపరిచారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలిలో మానవహారం నిర్వహించి, స్క్రీనింగ్ పరీక్షల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ, ఆధునిక వైద్య విధానాలు అందుబాటులో ఉండటంతో క్యాన్సర్‌ను జయించడం ఇప్పుడు సాధ్యమవుతోందని తెలిపారు. లక్షణాలు కనిపించకపోయినా ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మహిళలు స్వీయ పరీక్షల ద్వారా అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ జ్యోతి అన్నారు. శరీరంలో గడ్డలు లేదా ఆకస్మిక మార్పులు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. భయం వద్దని, అవగాహనే క్యాన్సర్‌పై పోరాటంలో ప్రధాన ఆయుధమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పాల్, డాక్టర్ శిరీషతో పాటు ఆర్డీటి వైద్య బృందం, నర్సింగ్ విద్యార్థులు, ఆశా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



క్యాన్సర్ మహమ్మారి గురించి అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అరుణ్ కుమార్



బత్తలపల్లి కూడలిలో మానవహారంగా నిలబడి నినాదాలు చేస్తున్న వైద్య సిబ్బంది

# శ్రీకృష్ణదేవరాయల జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించండి

**అసెంబ్లీలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ..**

**పుట్టపర్తి, (తెలుగోడు), ఫిబ్రవరి 13 :** విజయనగర సామ్రాజ్యాన్ని అత్యున్నత స్థితికి తీసుకెళ్లిన గొప్ప పరిపాలకుల్లో శ్రీకృష్ణదేవరాయలు అగ్రగణ్యుడు. ఈయన కాలమంతా సాహిత్య ,కళ సాంస్కృతిక స్వర్ణ యుగంగా సాగిందనీ మనం చెప్పుకోవచ్చు. తెలుగు సాహిత్యానికి గొప్ప పోషణ అందించినందుకు ఆయనను ఆంధ్రభోజుడుగా పేరుపొందారు. అలాంటి సమర్ధవంతమైన పరిపాలన ,ప్రజా సంక్షేమం ,వ్యవసాయ అభివృద్ధి, నీటిపారుదల సౌకర్యాలు కల్పించిన మహోన్నతమైన రాజు శ్రీకృష్ణదేవరాయలు అని ఆయన జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించి ఘనంగా నిర్వహించాలని శాసన సభ సమావేశాల సందర్భంగా రాష్ట్ర అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో శుక్రవారం పుట్టపర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి ప్రభుత్వాన్ని ప్రత్యేకంగా కోరారు. విజయనగర సామ్రాజ్యాన్ని పాలించి దక్షిణ భారతదేశ చరిత్రలో గొప్ప పరిపాలికుడిగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన శ్రీకృష్ణదేవరాయలు మృతి చెంది 600 సంవత్సరాలు కావస్తున్నప్పటికీ ఇప్పటికీ అందరి హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్నాడని ఎమ్మెల్యే పల్లె సింధూర కొనియాడారు. అలాంటి గొప్ప పరిపాలకుడు శ్రీకృష్ణదేవరాయలు జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించి ఘనంగా నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ముఖ్యమంత్రిని కోరారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి

# మామిడి సాగులో ఫ్రూట్ కవర్లతో నాణ్యమైన దిగుబడి

**ధర్మవరం హార్టికల్చర్ అధికారిణి బి. అమరేశ్వరి..**

**బత్తలపల్లి (తెలుగోడు), ఫిబ్రవరి 13 :** మామిడి పంటలో ఫ్రూట్ కవర్లు వినియోగించడం ద్వారా నాణ్యమైన దిగుబడి సాధించడంతో పాటు రైతులకు మంచి లాభాలు పొందవచ్చని ధర్మవరం హార్టికల్చర్ అధికారిణి బి. అమరేశ్వరి తెలిపారు. శుక్రవారం బత్తలపల్లి మండలంలోని పలు గ్రామాలలో ఉన్న మామిడి తోటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతన్నలతో మాట్లాడుతూ, మారుతున్న వాతావరణ పరిస్థితులు,చీడపీడల ఉధృతి కారణంగా మామిడి సాగులో పెట్టుబడి ఖర్చు పెరుగుతోందన్నారు. రసాయన మందుల వినియోగం అధికమవడం వల్ల పండ్ల నాణ్యత తగ్గి మార్కెట్లో సరైన ధర లభించని పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ఈ సమస్యలకు పరిష్కారంగా మామిడి ఫ్రూట్ కవర్లు ఎంతో ఉపయోగపడతాయని సూచించారు. ఫ్రూట్ కవర్లు వాడడం ద్వారా పండు ఈగ, తామర పురుగుల వంటి చీడపీడల నుండి మామిడి కాయలకు సంపూర్ణ రక్షణ లభిస్తుందని తెలిపారు. అలాగే అధిక వేడి, దుమ్ము, ధూళి ప్రభావం తగ్గి పండ్లు ఆకర్షణీయంగా తయారై మార్కెట్లో మంచి ధర పొందుతాయని చెప్పారు. మామిడి కాయలు సన్న నిమ్మకాయ పరిమాణంలో ఉన్నప్పుడే ఫ్రూట్ కవర్లు తొడగాలని ఆమె సూచించారు. మామిడి పంటలో ఫ్రూట్ కవర్ల వినియోగానికి ఉద్యానశాఖ ద్వారా హెక్టారుకు రూ. 15,000 వరకు సబ్సిడీ అందిస్తామని తెలిపారు. మామిడితో పాటు చీనీ, దానిమ్మ పంటలలో క్రాప్ కవర్లు, అలాగే అరటిలో బంచ్ కవర్లు వినియోగించే రైతులకు కూడా సబ్సిడీ వర్తిస్తుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నాణ్యమైన దిగుబడితో పాటు అధిక ఆదాయం పొందాలని ఆమె సూచించారు. మరిన్ని వివరాలకు సంబంధిత రైతు సేవా కేంద్రం లేదా ఉద్యానశాఖ అధికారులను సంప్రదించాలని తెలిపారు.



ధర్మవరం హార్టికల్చర్ అధికారిణి అమరేశ్వరి



మామిడికాయలకు కవర్లు తొడిగిన దృశ్యం



లేపాక్షి ఆలయాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్

# శివరాత్రి ఉత్సవాలకు కట్టుదిట్టమైన భద్రత

*లేపాక్షి ఆలయం సందర్శన.. జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ ..*

**లేపాక్షి (తెలుగోడు), ఫిబ్రవరి 13 :** లేపాక్షి వీరభద్ర స్వామి ఆలయంలో జరగనున్న మహాశివరాత్రి మహోత్సవాల సందర్భంగా జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ ఆలయాన్ని సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. 15, 16, 17, 18 తేదీల్లో నిర్వహించనున్న ఉత్సవాలకు సంబంధించి వి.వి.ఐ.పిల రాకతో పాటు భారీగా తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. హిందూపురం డీఎస్పీ కేవీ మహేష్‌తో కలిసి స్థానిక పోలీసు అధికారులతో భద్రతా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి అవసరమైన చోట్ల అదనపు కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈనెల 14వ తేదీ సాయంత్రం నుంచి 18వ తేదీ వరకు కట్టుదిట్టమైన బందోబస్తు కొనసాగుతుందని తెలిపారు. 15వ తేదీ నుంచి భక్తుల రద్దీ పెరిగే అవకాశముండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అమలు చేస్తామని చెప్పారు.

రథోత్సవం సందర్భంగా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, సమీప ప్రాంతాల్లో ఓపెన్ డ్రింకింగ్, ఆకతాయిల ఆగడాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామని వెల్లడించారు. సీసీ కెమెరాలు, డ్రోన్లు, నైట్ విజన్ పరికరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు. 15వ తేదీ సాయంత్రం నుంచి భక్తుల రద్దీకి అనుగుణంగా అదనపు ఏర్పాట్లు అమల్లోకి తీసుకువస్తామని తెలిపారు. స్థానిక పోలీసులతో పాటు అదనంగా వందమంది పోలీసు సిబ్బందితో బందోబస్తు పకడ్బందీగా నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని శైవక్షేత్రాల్లో కూడా మహాశివరాత్రి సందర్భంగా అవసరమైన భద్రతా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. జిల్లా ఎస్పీ వెంట హిందూపురం రూరల్ సీఐ జనార్ధన్, ఆలయ కమిటీ చైర్మన్ రామానంద, ఎస్ఐ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



సంగమేశ్వర క్షేత్రంలో ఏర్పాటులను పరిశీలిస్తున్న బిజెపి నాయకులు

# సంగమేశ్వర క్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం

**బత్తలపల్లి (తెలుగోడు), ఫిబ్రవరి 13 :** బత్తలపల్లి మండలంలోని అప్పరాచెరువు పంచాయతీ పరిధిలో గల చారిత్రక సంగమేశ్వర క్షేత్రంలో మహాశివరాత్రి పర్వదిన వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా శుక్రవారం బీజేపీ సీనియర్ నాయకులు ఆకులేటి వీరనారప్ప, సర్పంచ్ శారదమ్మ, సత్యనారాయణరెడ్డి, అనిల్ కుమార్ తదితరులు ఆలయాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ పరిసరాల్లో పారిశుద్ధ్య పనులు, వీధి దీపాల ఏర్పాటు చేపట్టారు. ఆదివారం మహాశివరాత్రి సందర్భంగా జాగరణ చేసే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు, పౌరాణిక నాటకాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

# రొళ్ల మండలానికి 9 పంపుసెట్లు

**రొళ్ల (తెలుగోడు), ఫిబ్రవరి 13 :** నీటి సమస్య ఉన్న గ్రామాలల్లో తవ్వించిన బోర్లకు బిగించేందుకు రొళ్ల మండలానికి 9 పంపు సెట్లు వచ్చినట్లు మడకశిర మార్కెట్ యార్డ్ చైర్మన్ గురుమూర్తి, మండల పార్టీ అధ్యక్షులు జి కె ఈరన్న, సింగల్ విండో అధ్యక్షులు దాసిరెడ్డి, ఏపీఐఐసి డైరెక్టర్ రామక్రిష్ణ,తెలిపారు. తాగు నీరు సమస్య ఉన్న ప్రతి గ్రామాన్ని గుర్తించి మోటార్ పుంపు సెట్లను మంజూరు చేయించారు. అందులో భాగంగా దొడ్డేరి, కొత్తపల్లి, రత్నగిరి గొల్లహట్టి, రత్నగిరి, ఎం.రాయపురంగొల్లహట్టి,హోట్టేబెట్టా, కల్లూరోప్పం, రోళ్ల గొల్లహట్టి,కాకి పంచాయతీ ఎల్ కె పల్లి వద్రహట్టి కీ చొప్పున పంపుసెట్లను మంజూరు చేసి గ్రామాలకు చేరవేశారు. నీటి సమస్యను గుర్తించి త్రాగునీరు దాహం తీర్చిన ఎమ్మెల్యే ఎం. ఎస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామికి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదలు తెలిపారు.



# ఇన్చార్జ్ ఎంపీడీవోగా అంజనప్ప

*ఘనస్వాగతం పలికిన చిన్ననాటి మిత్రులు..*

**నల్లమాడ (తెలుగోడు), ఫిబ్రవరి 13 :** నల్లమాడలో విద్యాభ్యాసం చేసిన అంజినప్ప ఇన్చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించేందుకు హాజరు కావడంతో ఆయన చిన్ననాటి మిత్రులు ఘనంగా స్వాగతం పలికారు. నల్లమాడ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి వరకు చదువుకున్న అంజినప్ప అదే మండలానికి అధికారిగా రావడం తమకు ఎంతో ఆనందంగా ఉందని అతని మిత్రబృందం ఆనందం వ్యక్తం చేశారు. పదవ తరగతి వరకు నల్లమాడలో చదివిన ఆయన, అనంతరం ఇంటర్, డిగ్రీ విద్యను కదిరిలో పూర్తి చేశారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్‌ను అనంతపురంలోని ఎస్కే యూనివర్సిటీలో అభ్యసించారు. విద్యార్థి దశలోనే క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగిన అంజినప్ప ఒడిసి మండల డిప్యూటీ ఎంపీడీవో గా విధులు నిర్వహిస్తూ, నల్లమాడ మండల ఇన్చార్జ్ ఎంపీడీవో గా బాధ్యతలు చేపట్టడం గర్వకారణమని ఆయన స్నేహితులు పేర్కొన్నారు. బాధ్యతలు స్వీకరించిన అంజినప్పకు ఆయనకు మిత్రులు శాలువాలు కప్పి, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా అంజన్నప్ప మాట్లాడుతూ చదివిన ప్రాంతానికే అధికారి గా రావడం ప్రత్యేక అనుభూతి అని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. నల్లమాడలో గడిపిన విద్యార్థి దశ తన జీవితంలో కీలక మలుపు అని గుర్తుచేసుకున్నారు. ఇక్కడి ప్రజలతో ఉన్న అనుబంధం కారణంగా మరింత బాధ్యతతో పని చేస్తానన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు తీసుకుంటానని, మండల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌస్ బాషా, కనుముక్కల లక్ష్మన్న, ఏఎన్ చంద్రశేఖర్ రెడ్డి, గంగాధర్, సివి రంగారెడ్డి, మసకవంకపల్లి మాజీ సర్పంచ్ సూర్యనారాయణ, మాధవరెడ్డి తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.



ఇన్చార్జ్ ఎంపీడీవో అంజనప్పను సన్మానిస్తున్న స్నేహబృందం



జీతం పెంచినందుకు సిఎంకు ధన్యవాదాలు తెలుపుతున్న 108 సిబ్బంది

# థాంక్యూ సీఎం సార్..

### కృతజ్ఞతలు తెలిపిన 108 సిబ్బంది

కోసిగి (తెలుగోడు), ఫిబ్రవరి 13 :
108 అంబులెన్స్ సర్వీస్‌లో ఉద్యోగులుగా పనిచేస్తున్న ఈ. యం.టి, పైలెట్‌లకు జీతం పెంచినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతూ శుక్రవారం నాడు కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 108 అంబులెన్స్ ముందు థాంక్యూ సీఎం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికే ఉన్న ఉద్యోగి యొక్క జీతం కు అదనంగా ప్రతి ఉద్యోగికి నెలకు 2వేల రూపాయలు అదనంగా పెంచడంతో పాటు, 5 నుండి 10సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకొన్న ఉద్యోగులకు ఆటోమేటిక్ స్లాబ్ అప్గ్రేడేషన్ చేయవలెనని నిర్ణయించడం ద్వారా మరింత ఆర్థిక వెసులుబాటును అందించి నట్లు అయిందని వారు అన్నారు. 108 అంబులెన్స్ ఉద్యోగులకు అందించిన ఆర్థిక పెంపుదలను ఉద్యోగులు అయిన ఈ.యం.టి మరియు పైలెట్లు అందరూ హర్షిస్తున్నాట్లు తెలిపారు. ఈ నెల నుండి స్లాబ్ అప్గ్రేడ్ చేసిన జీతాలు చేతికి అందడం తో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు అందరూ ఆంధ్రప్రదేశ్ 108 సర్వీస్ లో ఏకైక సంఘం అయిన ఏపీ 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ (హెచ్ -138 సిఐటియు అనుబంధం) ఉద్యోగ సంఘంగా థాంక్యూ సీఎం సార్ అని థాంక్యూ భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ అని నిర్వహించే వాహనం ముందు ప్లే కార్డులు ప్రదర్శిస్తూ వారికి ధన్యవాదాలు తెలియపరిచారు.. ఈ సందర్భంగా మేము చేస్తున్న విధినిర్వహణలో మరింత మెరుగైన సేవలు ఆపదలో ఉన్న వారికి అందించి ప్రభుత్వానికి మరియు భవ్య కంపెనీ వారికి మంచి పేరును తీసుకువస్తామని ఇందుమూలంగా తెలియచేస్తున్నాని వారు తెలిపారు



మాట్లాడుతున్న టౌన్ ఎస్ఐ మధుసూదన్ రెడ్డి

# రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు

ఎమ్మిగనూరు (తెలుగోడు), ఫిబ్రవరి 13 :
ఎమ్మిగనూరు భాష్యం స్కూల్ విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై జెడ్ఈఓ మాచాని కవిత ఆదేశాలతో ప్రిన్సిపాల్ బుట్టా నాగరాజు ఆధ్వర్యంలో శుక్రవారం సోమప్ప సర్కిల్లో ట్రాఫిక్ అవగాహన సదస్సు నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలో భాగంగా సీట్ బెల్టు జీబ్రా క్రాసింగ్ డ్రంక్ అండ్ డ్రైవ్ మొదలైన విషయాలను గురించి టౌన్ ఎస్ఐ మధుసూదన్ రెడ్డి తెలియజేశారు. పిల్లలు బైకులు నడపరాదని చెప్పారు. డ్రైవింగ్ లైసెన్సు తప్పనిసరిగా కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న భాష్యం స్కూల్ విద్యార్థులు


నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న వై ప్రదీప్ రెడ్డి

# నూతన వధూవరులను ఆశీర్వదించిన వై ప్రదీప్ రెడ్డి

కౌతాళం (తెలుగోడు), ఫిబ్రవరి 13 :
కౌతాళం సర్పంచ్ పాల్ దినకర్ అల్లుడి వివాహానికి హాజరైన జిల్లా ఉపాధ్యక్షులు వై ప్రదీప్ రెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించారు. వై ప్రదీప్ రెడ్డి , కౌతాళం మండలం అధ్యక్షులు దేశాయ్ ప్రహల్లాద ఆచారిని కౌతాళం సర్పంచ్ పాల్ దినకర్ పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వివాహ వేడుకలో పాల్గొన్న తెలుగుదేశం నాయకులు

కౌతాళం (తెలుగోడు), ఫిబ్రవరి 13 :
కౌతాళం మండలం కేంద్రంలో జరిగిన సర్పంచ్ పాల్ దినకర్ అల్లుడి వివాహానికి కౌతాళం సొసైటీ చైర్మన్ అల్లూరి వెంకటపతి రాజు, కౌతాళం సొసైటీ చైర్మన్ అల్లూరి వెంకటపతి రాజు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారిని సర్పంచ్ పాల్ దినకర్ పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కౌతాళం టౌన్ ప్రెసిడెంట్ డాక్టర్ రాజానందు , తెలుగు యువత గొట్టయ్య, మైనారిటీ నాయకులు సుల్తాన్ సుభాన్, రేవన్న తదితరులు పాల్గొన్నారు.


నూతన వధూవరులను ఆశీర్వదించి అల్లూరి వెంకటపతి రాజు



పద్మశ్రీ మందకృష్ణ మాదిగకు స్వాగతం పలుకుతున్న నాయకులు. మందకృష్ణ మాదిగను సన్మానిస్తున్న పెద్దకడబూరు నాయకులు

# సామాజిక న్యాయం కోసం అంబేద్కర్ ఆశయాలే మార్గదర్శి

## హాల్విలో అంబేద్కర్ నిలువెత్తు విగ్రహావిష్కరణ.. మందకృష్ణ మాదిగ..

పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 13 :
భారత ప్రజాస్వామ్యానికి దిశానిర్దేశం చేసిన డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ అస్తమించని మేధా సూర్యుడు అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. శుక్రవారం కౌతాళం మండలం హాల్వి గ్రామంలో ఏర్పాటు చేసిన డాక్టర్ అంబేద్కర్ నిలువెత్తు విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ కర్నూలు జిల్లా అధ్యక్షులు యస్. సుభాష్ చంద్ర మాదిగ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు శ్రమించిన మహాత్మ జ్యోతిరావు పూలే, డా. బి. ఆర్. అంబేద్కర్, డా. బాబూ జగ్జీవన్ రామ్‌ల ఆశయ సాధన కోసం సమాజం మొత్తం కృషి చేయాలని పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం, సమానత్వం సాధనలో అంబేద్కర్ భావజాలం శాశ్వత ప్రేరణగా నిలుస్తుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మిగనూరు టీడీపీ నేత రచించిన డా. బాబూ జగ్జీవన్ రామ్ జీవిత చరిత్రతో కూడిన "సమతా యోధుడు" పుస్తకాన్ని ఆవిష్కరించారు. ముందుగా తెలంగాణ రాష్ట్రం నుండి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన మందకృష్ణ మాదిగకు మాధవరం బ్రిడ్జి వద్ద ఘన స్వాగతం లభించింది. ఎమ్మిగనూరు నియోజకవర్గ నేతలు కదిరికోట ఆదెన్న, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి జి.


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ

ఆనంద్ చైతన్య మాదిగ, దళిత రచయిత సంఘం వ్యవస్థాపకులు ఆరెకంటి భాస్కర్, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గంజాహల్లి మహాదేవ్ మాదిగ, కోసిగి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బొగ్గుల తిక్కన్న, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ హాలహర్వి దావీదు, మాజీ సర్పంచ్ దాసు, ఎంఈఎఫ్ నాయకులు టీచర్ అంపయ్య, బూదూరు ప్రకాశం, మాజీ ఎంపీటీసీ గంజిల్లయ్య, మహిళా నాయకురాలు ఇ. లాడి జయమ్మ తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణలో ఎమ్మార్పీఎస్ నాయకులు. పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

# 16వ శాస్త్రీయ సలహా సంఘం సమావేశం విజయవంతం



16వ శాస్త్రీయ సలహా సంఘం సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

ఎమ్మిగనూరు (తెలుగోడు), ఫిబ్రవరి 13 :
ఎమ్మిగనూరు మండలం బనవాసిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన 16వ శాస్త్రీయ సలహా సంఘం సమావేశం శాస్త్రీయ చర్చలు, సాంకేతిక సూచనలు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికల రూపకల్పనతో సార్థకంగా ముగిసింది. ఈ సమావేశం వ్యవసాయ రంగంలో జరుగుతున్న మార్పులను సమీక్షిస్తూ, రైతుల ఆదాయ పెంపు లక్ష్యంగా సమగ్ర కార్యాచరణను రూపొందించేందుకు వేదికగా నిలిచింది.సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ ఎం. జాన్సన్ ప్రస్తుత పరిస్థితుల్లో అధిక సాంద్రత పత్తి సాగు పద్ధతి రైతులకు అధిక దిగుబడి మరియు మెరుగైన ఆదాయం అందించగలదని పేర్కొన్నారు. మట్టి పరీక్షల ఆధారంగా సమతుల్య ఎరువుల వినియోగం చేయడం ద్వారా ఖర్చులు తగ్గి, నేల ఆరోగ్యం మెరుగుపడుతుందని సూచించారు. అదనంగా నంద్యాల పప్పుశనగ-1267 రకాన్ని విస్తృతంగా ప్రాచుర్యం చేయడం ద్వారా జిల్లాలో పప్పుదినుసుల ఉత్పత్తిని పెంచవచ్చని తెలిపారు.
శ్రీమతి పి.ఎల్. వరలక్ష్మి గారు రైతులు రైతు ఉత్పత్తిదారుల సంస్థలుగా (ఎఫ్‌పీఓలు) ఏర్పడితే సమూహంగా మార్కెటింగ్ చేయడం, ప్రభుత్వ రుణ సౌకర్యాలు పొందడం, విలువ జోడింపు కార్యకలాపాలు చేపట్టడం సులభమవుతుందని వివరించారు. వ్యవసాయ ఉత్పత్తులకు బ్రాండింగ్, నిల్వ సదుపాయాలు, ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు ద్వారా రైతుల లాభదాయకత పెరుగుతుందని సూచించారు. డాక్టర్ కే. రాఘవేంద్ర చౌదరి గారు గత సంవత్సరంలో నిర్వహించిన విస్తరణ కార్యక్రమాలు, శిక్షణా శిబిరాలు, ప్రదర్శన పొలాలు, రైతు మేళాలు తదితర కార్యక్రమాల ప్రగతిని వివరించారు. రాబోయే సంవత్సరానికి పంటల వైవిధ్యీకరణపై ప్రత్యేక దృష్టి సారిస్తూ మిల్లెట్స్ ప్రోత్సాహం, తక్కువ నీటి వినియోగంతో అధిక దిగుబడి ఇచ్చే పంటలు, వాతావరణ అనుకూల వ్యవసాయ సాంకేతికతలను రైతులకు చేరవేయాలని కార్యాచరణ ప్రణాళికను ప్రకటించారు. అటారి నుండి హాజరైన డాక్టర్ తుసార్ రంజన్ సాహూ గారు ఆధునిక సాంకేతికతల ప్రాముఖ్యతను వివరించారు. డ్రోన్ పిచికారీ ద్వారా సమర్థవంతమైన పురుగుమందుల వినియోగం, ప్రెసిషన్ ఫార్మింగ్ ద్వారా ఇన్‌పుట్ ఖర్చుల నియంత్రణ, డిజిటల్ వ్యవసాయ సలహా సేవల ద్వారా రైతులకు సమయానుకూల సమాచారం అందించడం వంటి అంశాలను విస్తృతంగా అమలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా స్థాయి ఉద్యాన అధికారి డాక్టర్ ఏ రాజా కృష్ణ రెడ్డి, సుబ్బారెడ్డి నాబార్డ్ ,నంద్యాల పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు, కె.వికే శాస్త్రవేత్తలు, డాట్స్ సెంటర్ శాస్త్రవేత్తలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులు, ప్రగతిశీల రైతులు, యువ నిపుణులు పాల్గొని తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.


క్షేత్రస్థాయిలో పర్యటించిన దృశ్యం



లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న విద్యార్థినులు

## కృతజ్ఞత ర్యాలీ..

ఎమ్మిగనూరు (తెలుగోడు), ఫిబ్రవరి 13 :
రూ.1200 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసిన సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు ఎమ్మిగనూరు పట్టణంలోని కర్నీ ఫంక్షన్ హాల్ నుండి పద్మశ్రీ మాచాని సోమప్ప సర్కిల్ వరకు విద్యార్థులతో కలిసి భారీ కృతజ్ఞతా ర్యాలీ నిర్వహించారు. రూ.1200 కోట్ల ఫీజు

# లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం

రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసి పేద విద్యార్థులకు వరంగా నిలిచిన కూటమి ప్రభుత్వానికి, ముఖ్యంగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి ' థ్యాంకూ లోకేష్ అన్న ' అంటూ విద్యార్థులు, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి ఆనందం వ్యక్తం చేశారు. పేద, మధ్యతరగతి విద్యార్థుల ఉన్నత విద్యకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్, మండల, పట్టణ కమిటీ అధ్యక్షులు, గ్రామ మరియు వార్డు కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




లోకేష్ చిత్రపటంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు, కూటమి నేతలు


మట్టి ఖర్చులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న వైసీపీ నాయకులు

# అధైర్యపడొద్దు అండగా ఉంటాం

### వడ్డె లక్ష్మన్న కుటుంబ సభ్యులకు వైసీపీ భరోసా..

పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 13 :
పెద్దకడబూరు గ్రామానికి చెందిన వడ్డె లక్ష్మన్న భార్య వడ్డె శంకరమ్మ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, వైసీపీ బూత్ విభాగం తాలూకా అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి వడ్డె శంకరమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి, వడ్డె లక్ష్మన్నకు ధైర్యం చెప్పారు. "అధైర్యపడొద్దు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మట్టి ఖర్చుల నిమిత్తం తక్షణ సాయంగా రూ. 5 వేలు నగదును ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వడ్డె బాబు, బంధువులు పాల్గొన్నారు.


లింగన్న మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న కౌతాళం మండలం అధ్యక్షులు దేశాయ్ ప్రహల్లాద

# లింగన్న కుటుంబానికి ఆర్థిక సాయం

### వైకాపా నేత దేశాయ్ ప్రహల్లాద ఆచారి ..

కౌతాళం (తెలుగోడు) ఫిబ్రవరి 13
కౌతాళంలో మండల కేంద్రంలో వైఎస్ఆర్సిపి కార్యకర్త బారిక లింగన్న కడుపునొప్పి తాళలేక మృతి చెందిన విషయం తెలిసిన వైకాపా నేతలు లింగన్న మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కౌతాళం వైఎస్ఆర్సిపి మండలం కన్వీనం లిదేశాయ్ ప్రహ్లోద ఆచారి మట్టి ఖర్చుల కోసం 10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు ఈ కార్యక్రమంలో కౌతాళం సర్పంచ్ పాల్ దినకర్, వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి, ఉపసర్పంచ్ సక్రి తికయ్య, వడ్డే రాము, బెస్తా నాగరాజు, వడ్డే చిన్ని'ఉసేని ,మర్రి స్వామి, సక్రి శ్రీరామ్ మరియు నాయకులు తదితరులు పాల్గొన్నారు


10 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేసిన దేశాయ్ ప్రహ్లోద ఆచారి

# గవర్నర్‌ను కలిసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

విజయవాడ (తెలుగోడు), ఫిబ్రవరి 13 :
రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్‌ని శుక్రవారం సాయంత్రం విజయవాడలోని లోక్‌భవన్లో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బడ్జెట్ సమావేశాల్లో గౌరవ గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపారు.





## మట్కా ఆడుతున్న వ్యక్తి అరెస్టు

*రూ. 15, 500 స్వాధీనం..*

**ముద్దనూరు (తెలుగోడు), ఫిబ్రవరి 13 :** గ్రామ పరిధిలో మట్కా ఆడుతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ నగేష్ బాబు తెలిపారు. పోలీసులు తెలిపిన సమాచార మేరకు ముద్దనూరు పరిధిలోని వివేకవర్ధని జూనియర్ కళాశాల సమీపంలో మట్కా ఆడుతుండగా తమ సిబ్బందితో వెళ్లి అదుపులోకి తీసుకున్నామన్నారు. మట్కా స్లిప్పులు, 15, 500 రూపాయల నగదు స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు సీఐ నగేష్ బాబు తెలిపారు.



గాయపడిన మునికుమార్

## రెండు బైకులు ఢీ ఒకరికి తీవ్ర గాయాలు

**ముద్దనూరు (తెలుగోడు), ఫిబ్రవరి 13 :** స్థానిక నాలుగు రోడ్ల కూడలికి వెళ్లే జాతీయ రహదారిలో రెండు బైకులు ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు ముని కుమార్ స్టేట్ బ్యాంక్ సమీపంలో ఉన్న ఓ చిన్న రహదారి నుండి బయటకు వస్తుండగా వేగంగా వస్తున్న బైక్ ఢీకొంది. దీంతో మునికుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఆయనను ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.

## విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

**రామకుప్పం (తెలుగోడు), ఫిబ్రవరి 13 :** విద్యుత్ ఉప కేంద్రాలలో మరమ్మతుల దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని రెస్కో చైర్మన్ విజీ. ప్రతాప్, వైస్ చైర్మన్ విశ్వనాథ్ ,ఎండి సోమశేఖర్లు తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు రామకుప్పం, శాంతిపురం మండలంలోని సబ్ స్టేషన్‌లో మరమ్మతులు నిర్వహించనున్నారన్నారు. ఈ సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఈ అంతరాయానికి ప్రజలు, రైతులు సహకరించాలని కోరారు.




మాట్లాడుతున్న యూటీఫ్ గౌరవ అధ్యక్షులు కె. భూతన్న

## పిఆర్‌సి అమలుకై యుటిఎఫ్ రణభేరి-2.0

*"చలో విజయవాడ" విజయవంతం చేయండి: యూటీఫ్ నాయకులు*

**రోళ్ల (తెలుగోడు), ఫిబ్రవరి 13 :** మండల అధ్యక్షుడు వి.ఎన్. మాలింగప్ప ,మడకశిర తాలూకా సమన్వయకర్త టీ.మూడ్ల గిరియప్ప ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో యూటీఫ్ నాయకులు రణభేరి-2.0 సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా యూటీఫ్ గౌరవాధ్యక్షులు కే. భూతన్న జిల్లా కార్యదర్శి డి. నరసింహప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు కావస్తున్న ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని కనుక తక్షణమే 12 వ పిఆర్సి కమిటీ వేసి కమిషన్ చైర్మన్ ను నియమించాలని 29 శాతం ఐఆర్ ను ప్రకటించాలని పెండింగ్ పడ్డ డి ఎ లను విడుదల చేయాలన్నారు.ఉపాధ్యాయ, పెన్షనర్స్ కు అరియర్స్ చెల్లింపుకు రూట్ మ్యాప్ ప్రకటించాలని,హెల్త్ కార్డ్ ఉ మెడికల్ రీయంబర్స్మెంట్ అమలు చేయాలని సి పి ఎస్ ను రద్దుచేసి ఓ పి ఎస్ ను అమలు చేయాలి అనే డిమాండ్లతో ఈ నెల 17 విజయవాడ లో యూటీఫ్ నిర్వహించుజహ "చలో సెక్రటరీయేట్ కార్యక్రమం విజయవంతం"నికి ప్రతి యూటీఫ్ నాయకులు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఫ్ నాయకులు కె.ఎల్లప్ప,డి. అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# లబ్దిదారులకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ

### యువ నేత మారినేని రామకృష్ణ..

**ఉదయగిరి/వరికుంటపాడు (తెలుగోడు), ఫిబ్రవరి 13 :** వరికుంటపాడు మండలంలోని తూర్పు రొంపి దొడ్ల గ్రామంలోని పలు కుటుంబాలకు యువ నేత మారినేని రామకృష్ణ ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. గ్రామంలోని పలు కుటుంబాలు గ్యాస్ కనెక్షన్ లేక తీవ్ర ఇబ్బందులకు గురవడంతో విషయం తెలుసుకున్న యువనేత మారినేని రామకృష్ణ ఆయా కుటుంబాల వద్దకు నేరుగా వెళ్లి ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం ద్వారా ప్రభుత్వం అందించే ఉచిత గ్యాస్ కనెక్షన్ గురించి వివరించారు. వారి నుంచి అవసరమైన ధ్రువపత్రాలు సేకరించి గ్యాస్ ఏజెన్సీ ప్రొప్రైటర్ ఓబయ్య దృష్టికి తీసుకొని దగ్గరుండి పేర్లు నమోదు చేయించి ఉచిత గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేయించారు. అనంతరం యువనేత మారినేని రామకృష్ణ చేతుల మీదుగా లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా యువ నేత మార్నిని రామకృష్ణ మాట్లాడుతూ గ్రామంలోని నిరుపేదలు పేద బడుగు బలహీన వర్గాలకు ఇంకా ఇప్పటికి గ్యాస్ కనెక్షన్లు లేక కట్టెల పొయ్యితో ఇబ్బంది పడటం గమనించామన్నారు. అలాంటివారందరికీ నూతన గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేయించామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సహాయ సహకారాలతో గ్రామంలోని ప్రతి పేదవానికి అవసరమైన పథకాలను గుర్తించి అందిస్తామని తెలిపారు. గ్రామంలోని ప్రజలతో నిత్యం మమేకమవుతూ వారి సమస్యలు తెలుసుకుంటూ ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ యువనేత మంత్రివర్యులు నారా లోకేష్ , ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆశయాలకు అనుగుణంగా గ్రామంలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేయటం జరుగుతుందని తెలిపారు. గత పాలకులు కేవలం కొంతమందికే పథకాలు పరిమితమయ్యేయని కానీ ప్రస్తుతం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సహకారంతో గ్రామంలోని ప్రజలందరూ సంక్షేమ పథకాలు ఎటువంటి అవినీతికి తావు లేకుండా ప్రజలకు అందించడం జరుగుతుందని అన్నారు. భవిష్యత్తులో గ్రామంలో అభివృద్ధి సంక్షేమం ప్రజలకు అందించడానికి తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ ప్రయత్నానికి అన్నివేళలా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సహాయ సహకారాలు అందిస్తున్నందుకు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు పాల్గొన్నారు.



లబ్దిదారులకు గ్యాస్ కనెక్షన్లు ఇప్పిస్తున్న యువ నేత మారినేని రామకృష్ణ



లబ్దిదారులకు గ్యాస్ కనెక్షన్లు ఇప్పిస్తున్న యువ నేత మారినేని రామకృష్ణ

# ఆధ్యాత్మిక భావాలతో మానసిక ప్రశాంతత

### ఘనంగా త్రిమూర్తి శివ జయంతి మహోత్సవాలు .. బ్రహ్మ కుమారి సుధారాణి..

**మెళియాపుట్టి (తెలుగోడు), ఫిబ్రవరి 13 :** ఆధ్యాత్మిక భావాలతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని బ్రహ్మకుమారి సుధారాణి. అన్నారు. మండలంలోని చాపర ప్రజా పిత బ్రహ్మ కుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం (ఓం శాంతి) త్రిలోక భవనంలో 90 వ త్రిమూర్తి శివ జయంతి మహోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు పూర్ణ కళశాలతో చాపర గ్రామ పురవీధుల్లో ఊరేగింపు, శివ పతాక ఆవిష్కరణ, జ్యోతి ప్రజ్వలన , జ్యోతిర్లింగ దివ్యదర్శనం, అభిషేక లింగ దర్శనం, కేక్ కట్ చేసి ఆనందోత్సవాలు జరుపుకున్నారు.అనంతరం నిర్వహించిన సమావేశంలో బ్రహ్మకుమారి సుధారాణి మాట్లాడుతూ అజ్ఞానం ను దూరం చేసి జ్ఞానాన్ని పెంపొందించడానికి పరం జ్యోతి స్వరూపుడు పరమేశ్వరుడు భూమి పై అవతరించే స్మిత చిహ్నంగా మహా శివరాత్రి,ఈ పర్వదినం సందర్భంగా జాగరణ, ఉపవాసము చేస్తుంటారు.ఆత్మ జాగృతి కి జాగరణ చేసి,మంచి గుణాలు ఆలోచన ఉపవాసం ఆచరించవలసిన జ్ఞాన మార్గాలు అవశ్యకత తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీ లు మోహిని రాజ్యలక్ష్మి, విజయ, పరివార సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న బ్రహ్మకుమారీలు



ర్యాలీ నిర్వహిస్తున్న బ్రహ్మకుమారీలు

# శిల్పకళలకు నిలయం హేమావతి శ్రీ సిద్దేశ్వర స్వామి ఆలయం

### శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు..

**అమరాపురం (తెలుగోడు), ఫిబ్రవరి 13 :** మండల పరిధిలో హేమావతి శ్రీ సిద్దేశ్వర స్వామి శివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శిల్పకలకు నిలయంగా విరజిల్లుతోంది. సుప్రసిద్ధ ప్రసిద్ధిగాంచిన శైవ క్షేత్రం హేమావతి అమరాపురం మండలానికి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న హేమావతి ప్రస్తుతం ఓ కుగ్రామం. క్రీస్తు శకం 720లో నలంబ రాజ్యానికి రాజధానిగా నెల గొందటమే కాకుండా ఎన్నో కీర్తి ప్రతిష్టలను అర్జించింది. హేమావతి ఒక చారిత్రాత్మక నామం తదనంతరం హైమావతిగా పిలవడంతో ప్రస్తుతం హేమా వతిగా మారింది. దీనిని రాజధానిగా చేసుకొని నలంబ రాజులైన మొగల్ రాజు మొదట పాలించినట్లు చారిత్రక ఆధారాలు ద్వారా తెలుస్తోంది. నడంబ రాజు లకు సామంతులైన పల్లవరాజు తిరు పయ్య, పల్లవ సింహా విష్ణు అనంతపురం, కర్నూలు చిత్తూరు, కర్ణాటక రాష్ట్రం చిత్రదుర్గ, ధారవాడ, తుంకూర్ తమిళనాడులోని ధర్మపురి, సేలం, జిల్లాలను కలుపుకొని రాజ్య పరిపాలన చేసినట్లు శిలాశాసనాల ద్వారా తెలుస్తోంది. నాటి నుంచి నేటి వరకు హేమావతి లోని శ్రీ సిద్దేశ్వర స్వామి ఆలయ సముదాయం శిల్పకళకు నిలయంగా నిలిచింది. హేమావతి గ్రామంలో విశాలమైన 14 ఎకరాల విస్తీర్ణంలో ఆలయ సముదాయం పార్కు భక్తులకు కనువిందు చేస్తోంది. ఇక్కడ ప్రధానంగా శ్రీ సిద్దేశ్వర స్వామి ఆలయం, శ్రీ దొడ్డేశ్వర స్వామి ఆలయం, శ్రీ మల్లేశ్వర స్వామి ఆలయాలు ఉన్నాయి. ఆలయ ప్రాంగణంలోని కి ప్రవేశించిన వెంటనే మహా ద్వారంలో శ్రీ సిద్దేశ్వర స్వామి విగ్రహం ఉన్న ఆలయం కాన వస్తుంది. దేశంలో ఎక్కడ లేని విధంగా శివుని లింగ రూపం లో కాకుండా మానవ రూపంలో ఇక్కడ దర్శనమిస్తోంది. శ్రావణమాసం, కార్తీక మాసం లో సూర్య అస్త మయ సమయంలో సూర్యకిరణాలు స్వామివారి ముఖ పై పడటం మరో విశేషం చెప్పవచ్చు. ఆలయ ముఖద్వారానికి ముందు భాగాన ధ్వజస్తంభం ఏర్పాటు చేశారు. కుడి వైపున అగ్నిగుండం, ఎడమవైపున ఆ స్థాన మండపం ఉన్నాయి. పక్కన శ్రీ దొడ్డేశ్వర స్వామి ఆలయం ఉంది. ఈ ఆలయం లో పెద్ద శివలింగం చూపరులకు కనువిందు చేస్తుంది. ఈ ఆలయం రాతి స్తంభాలతో నిర్మితమైనది. అన్ని స్తంభాలపైన రామాయణం, భాగవతం దృశ్యాలు రమనీయంగా చేశారు. ఆలయంలో 8 అడుగుల ఎత్తు ఉన్న నందీశ్వరుని విగ్రహం ఉంది. 80 అడుగుల పొడవు, 40 అడుగుల వెడల్పు ఉన్న నందీశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో ఘటిక శాసనాల ద్వారా తెలుస్తోంది. ఘటిక స్థానంలో శిక్షణ తీసుకున్న వారు కంచి పీఠం తదితర ప్రాంతాలకు వెళ్లి తమ పాండిత్యాన్ని ప్రదర్శించే వారు తెలుస్తోంది. ఇక్కడ దొరికిన విగ్రహాలను పురావస్తు శాఖ నిర్మించిన మ్యూజియంలో భద్రపరిచారు. శ్రీ సిద్దేశ్వర స్వామి శివరాత్రి బ్రహ్మోత్సవాలు ఏర్పాట్లు పూర్తి ఈనెల 15 ఆదివారము నుండి ఈనెల 22 ఆదివారం వరకు వైభవంగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ కర్రీ గౌడ తెలిపారు. ఈ నెల 15న ఆదివారం శ్రీ సిద్దేశ్వర స్వామికి మహాశివరాత్రి రుద్రాభిషేకం, ఆకాండ పూజ. ఈనెల 16న సోమవారం భాను పల్లకి ఉత్సవం, ఈ నెల 17న మంగళవారం అగ్గిగుండం, ఈనెల 18 న. బుధవారం సిడిమాను ఉత్సవం. రాత్రి ముత్యాల పల్లకి. ఈనెల 19 న. గురువారం చిన్న రథోత్సవం, రాత్రి ముత్యాల పల్లకి, ఈనెల 20న శుక్రవారం బ్రహ్మరథోత్సవం. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కరే గౌడ ఈ.వో నరసింహారాజు కోరారు. హిందూపురం, కళ్యాణదుర్గం ఏ.పీ ఎస్. ఆర్టీసీ డిపో నుండి ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంటాయని తెలిపారు.



మానవఆకారంలో శ్రీ సిద్దేశ్వర స్వామి









ఆలయ ముఖద్వారం. శ్రీ సిద్దేశ్వర స్వామి ు అగ్నిగుండం



సమావేశమైన వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక నేతలు

## వెనుకబడిన ప్రాంతాలను నిర్లక్ష్యం చేస్తే మూల్యం చెల్లించుకోక తప్పదు

*వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక*

**కడప (తెలుగోడు), ఫిబ్రవరి 13 :** వెనుకబడిన ప్రాంతాలను నిర్లక్ష్యం చేస్తే మూల్యం చెల్లించుకోక తప్పదని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక హెచ్చరించింది. కడపలో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో పలువురు మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయిన తర్వాత వెనుకబడిన ప్రాంతాలు మరింత నిర్లక్ష్యానికి గురి అవుతున్నాయని,ఇలాగే కొనసాగితే ఈ ప్రాంతాలలో ప్రజల నుండి తీవ్రమైన తిరుగుబాటు వస్తుందన్నారు 2026-27 బడ్జెట్లో రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన ప్రాంతాలకు ప్రాధాన్యత క్రమంలో నిధులు కేటాయించి పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడంతో పాటు, ఆయకట్టుకు నీళ్లు ఇవ్వాలని, పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగ కల్పన చేయాలని,నీళ్లు,నిధులు, నియామకాలు అన్ని ప్రాంతాలకు సమానంగా అందించాలని, 60 సంవత్సరములుగా పేద ప్రజల పండగ నిలబడిన ఆర్టీకి ఎఫ్ సి ఆర్ ఏ రెన్యువల్ చేయాలని, మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టం-2005ను పునరుద్ధరించాలని, విభజన చట్టంలో పొందుపరిచిన బుందేల్ఖండ్ తరహా ప్యాకేజీని వెనుకబడిన ప్రాంతాలు అమలు చేయాలని కోరారు. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర,ప్రాంతాలలో జాతాలు నిర్వహించి ప్రజలను సంఘటితం చేయాలని తీర్మానించారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు బి. నారాయణ, కార్యదర్శి డాక్టర్ శ్యాంప్రసాద్, ఉపాధ్యక్షులు కేవీ రమణ, జి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలతో విద్యార్థులకు ఉపశమనం

*మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు*



**రామకుప్పం (తెలుగోడు), ఫిబ్రవరి 13 :** రాష్ట్రంలోని విద్యార్థిని, విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ నిధులు విడుదలతో ఎంతో ఉపశమనం కలిగిందని మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ 2024- 25 విద్యాసంవత్సరానికి బకాయిలు ఉన్న 1,198 కోట్లును విద్య, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ విడుదల చేశారు. విద్యార్థులు ఫీజుల కోసం ఇబ్బందులు పెడితే చర్యలు తీసుకుంటామని కాలేజీలకు ఆదేశాలిచ్చారు. యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు విశ్వవిద్యాలయాలకు ఒకే చట్టం కిందకు తీసుకొస్తున్నారు. వైసిపి ప్రభుత్వం అధికారం కోల్పోయే నాటికి 2.832 కోట్లు బకాయిలు ఉందన్నారు. దీన్ని కుటుంబం విడతల వారీగా నిధులు మంజూరు చేసింది. 2014- 19 టిడిపి పాలనలో ఏటా 16 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రియంబర్స్ మెంట్ చేస్తే జగన్ రెడ్డి పాలనలో కేవలం 9 లక్షల మందికి అది కూడా విడుదలవారీగా ఇచ్చి దాదాపు 7 లక్షల మంది పేద విద్యార్థులకు మోసగించారని విమర్శించారు. వైసిపి ప్రభుత్వంలో దగా పడిన విద్యార్థులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుంది అన్నారు. జగన్ రెడ్డి పాలనలో అనేక కాలేజీల్లో అవినీతి అక్రమాలకు చోటు చేసుకున్నయన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో ప్రజలే వైసిపి పార్టీకి తగిన బుద్ధి చెప్తారని తెలిపారు.



ఇరిగేపల్లి గ్రామంలో పంపుసెట్లను దించుతున్న దృశ్యం

## మోటారు పంపు సెట్లు సరఫరా

**అగళి (తెలుగోడు), ఫిబ్రవరి 13 :** మడకశిర నియోజకవర్గంలో చాలా రోజులుగా నీటి సమస్య ఉన్న గ్రామాల్లో తవ్వించిన బోర్లకు 29 మోటారు పంపు సెట్లు గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి ఐచర్ వాహనం ద్వారా సరఫరా చేశారు. వచ్చిన పుంపు సెట్లను ఆయా గ్రామాలకు పంపించారు.ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల నాయకులు మాట్లాడుతూ రాబోయ వేసవికాలంను దృష్టిలో ఉంచుకొని తాగునీటి శాశ్వత పరిష్కారం కోసం ముందస్తు చర్యగా బోరు బావులకు అమర్చే పైపులు మోటార్ పంపుసెట్లు సరఫరా చేసిన ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈకార్యక్రమం లో జెడ్పిటిసి ఉమేష్, వైస్ ఎంపిపి గాయత్రి హిమంత్ రాజు, ఇరిగేపల్లి మాజీ ఉప సర్పంచ్ రామచంద్రప్ప,భూత్ ఇంచార్జ్ ఫీల్డ్ అసిస్టెంట్ మంజునాథ్ సీనియర్ నాయకులు రాజన్న శివన్న హరీష్, మండలంలోని ఆయా గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అల్పాహారం పంపిణీ

*ఎంఈఓ -2 చంద్రశేఖర్ నాయుడు*

**అగళి (తెలుగోడు), ఫిబ్రవరి 13 :** శుక్రవారం సాయంత్రం మండల పరిధిలోని ఇరిగేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కలసి అల్పాహారం పంపిణీ చేశారు. అదేవిధంగా 10వ తరగతి పరీక్షల వరకు ప్రతిరోజు విద్యార్థులకు అల్పాహారం పంపిణీ చేస్తున్న ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులకు ఎంఈఓ 2 చంద్రశేఖర్ నాయుడు ధన్యవాదములు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకలి గొన్న విద్యార్థులకు ఏర్పాటు చేసిన అల్పాహారం ఏర్పాటు చేయడం గర్వించదగ్గ విషయం అని అన్నారు.






విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్న దృశ్యం

# ముఖ్యమంత్రి చంద్రబాబుని కలిసిన ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల

**రోళ్ల (తెలుగోడు), ఫిబ్రవరి 13 :**
రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుని ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు,మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి శుక్రవారం విజయవాడలో కలిశారు. ఈసందర్భంగా మడకశిర నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, మరింత అభివృద్ధికి తోడ్పాటు నందించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.


ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

# జంబులింగేశ్వర స్వామి మహాశివరాత్రి మహోత్సవానికి ఆహ్వానం

**తనకల్లు (తెలుగోడు), ఫిబ్రవరి 13 :**
తనకల్లు మండల పరిధిలోని కొక్కంటి క్రాస్ బాలసముద్రం రోడులో ఉన్న శ్రీ గౌరీ సమేత జంబులింగేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం, సోమవారం రెండు రోజులూ మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త, పూజారులు తెలిపారు. శివరాత్రి పండుగ రోజు రుద్రాభిషేకం, అర్చనలు, అభిషేకాలు, తీర్థప్రసాదాలు వితరణ జరుగునని మరుసటి రోజు సోమవారం ఉదయం 9 గంటలకు శ్రీ గౌరీ సమేత పరమేశ్వరులైన శివపార్వతుల కళ్యాణం మధ్యాహ్నం 3 గంటలకు శ్రీ గౌరీ సమేత జంబులింగేశ్వర స్వామి వారికి గ్రామోత్సవం నిర్వహిస్తారన్నారు. శివరాత్రి పండుగ రోజు రాత్రి జాగరణ కొరకు హరికథ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ రెండు రోజుల కార్యక్రమాలకు విచ్చేస్తున్న భక్తాదులకు కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో గాలివీటి వెంకటరమణ నాయుడు, బాగేపల్లి చలపతి, కావడి ప్రవీణ్ కుమాం భోజన వసతి కల్పిస్తున్నారన్నారు. భక్తులందరూ ఈ కార్యక్రమాల్లో పాల్గొని శివానుగ్రహాన్ని పొందాలన్నారు.


శ్రీ శివ చిత్రలింగేశ్వర స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు నరేష్ స్వామి

# శ్రీ పాలేనహళ్లి శివ చిత్ర లింగేశ్వర స్వామికి 15న మేలు దీపోత్సవం

**అమరాపురం (తెలుగోడు), ఫిబ్రవరి 13 :**
అమరాపురం మండల సరికొద్దు ప్రాంతంలో గల కెంచమనహళ్లి గ్రామంలో శివరాత్రి సందర్భంగా ఆదివారం పాలేనహళ్లి లో పుణ్యక్షేత్రమైన శ్రీ శివ చిత్ర లింగేశ్వర స్వామి జాగరణ మహోత్సవం మేలు దీపం, స్వామి వారికి పాలాభిషేకం, వచ్చిన భక్తులకు మహా మంగళహారతి, తీర్థప్రసాదాలు అర్చకులు పి. నరేష్, రాజప్ప స్వామి నిర్వహిస్తారని, శ్రీ పాలే న హళ్లి శివ చిత్ర లింగేశ్వర స్వామి ట్రస్ట్ ఆధ్వర్యంలో . శివరాత్రి జాగరణ నిమిత్తం , కోలాటాలు, చక్క భజన, సాంస్కృతిక కార్యక్రమాలు, నిర్వహిస్తారని తెలిపారు..చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.


మాట్లాడుతున్న తెదేపా కన్వీనర్ తొట్లిరెడ్డి శేఖర్ రెడ్డి

# తిమ్మమాంబ మహోత్సవాలను జయప్రదం చేద్దాం

**తెదేపా కన్వీనర్ తొట్లిరెడ్డి శేఖర్ రెడ్డి ..**

**తనకల్లు (తెలుగోడు), ఫిబ్రవరి 13 :**
నంబులపూలకుంట మండల పరిధిలోని గూటిబైలు గ్రామంలో తిమ్మమ్మ మర్రిమాను వద్ద మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ఈనెల 14, 15, 16వ తేదీల్లో జరుగు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిమ్మమాంబ మహోత్సవాలకు సకుటుంబ సమేతంగా విచ్చేసి జయప్రదం చేయాలని తెలుగుదేశం పార్టీ కన్వీనర్ తొట్ల రెడ్డి శేఖర్ రెడ్డి కోరారు. తనకల్లు మండల కేంద్రంలోని శ్రీ చౌడేశ్వరి దేవస్థానంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాసనసభ్యులు కందికుంట వెంకట ప్రసాద్ ఆదేశాల మేరకు ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. తనకల్లు నుండి (వయా) కొక్కంటి క్రాస్ మీదుగా తిమ్మమ్మ మర్రిమాను వరకు ప్రత్యేకంగా ఆర్టిసి బస్సులు నడుపుతారన్నారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో “”ఉచిత అన్నదాన “”కార్యక్రమం ఉంటుందన్నారు. అదేవిధంగా “”ఈశా ఫౌండేషన్ “” ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ప్రజలకు తెలియజేసారు .ప్రజలందరూ పండుగ సందర్భంగా శ్రీ తిమ్మమాంబ ఆలయాన్ని దర్శించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ రెడ్డి శేకర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు

# డగ్స్‌పై యుద్ధంతో యువతలో మార్పు

**విజయవాడ (తెలుగోడు), ఫిబ్రవరి 13 :**
కూటమి ప్రభుత్వం డగ్స్‌పై తలపెట్టిన యుద్ధం రాష్ట్రాన్ని, యువతను మంచి దారిలో నడిపిస్తోందని రాష్ట్ర హోం మంత్రి అనిత తెలిపారు. గత 19 నెలల కాలంలో గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలన కోసం పోలీసులు, ఈగల్ విభాగం అహర్నిశలు కృషి చేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. గత ఏడాదిలో ఈగల్ విభాగం సాధించిన విజయాలు, చేపట్టిన కార్యక్రమాలపై రూపొందించిన వార్షిక నివేదికను ఈగల్ ఐజీ రవికృష్ణ, గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి అందజేశారు. ఈ సందర్భంగా ఈగల్ సాధించిన విజయాలను ముఖ్యమంత్రి అభినందించడం ఎంతో సంతృప్తినిచ్చిందని మంత్రి అనిత తెలిపారు. ప్రత్యేకంగా “ఆపరేషన్ చైతన్యం” పేరుతో గంజాయి సాగు నిర్మూలనకు శాటిలైట్, డ్రోన్ల ద్వారా నిఘా పెట్టి, వేల ఎకరాల్లో గంజాయి సాగును ధ్వంసం చేసినట్లు వివరించారు.


కాలినడకన శ్రీశైలం చేరుకుంటున్న భక్తులు

# శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు

## పాతాళగంగలో పుణ్యస్నానాలు .. కాలినడకన వస్తున్న భక్తులు..

**శ్రీశైలం (తెలుగోడు), ఫిబ్రవరి 13 :**
ప్రముఖ శైవ క్షేత్రంగా క్షేత్రంగాశక్తిపీఠంగా విరాజిల్లుతున్న శ్రీశైల మహా క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా దేవస్థానం నిర్వహిస్తున్నారు. దేశ నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు శ్రీశైలం చేరుకొని పవిత్ర పాతాళ గంగలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకునేందుకు క్యూ లైన్ లో వేచి ఉన్నారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటన జరగకుండా ఉండేందుకు పోలీసు వారు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీ అధికారులను ఎప్పటికప్పుడు సమన్వయంతో శ్రీశైలం వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ అంతరాయాలు లేకుండా పార్కింగ్ ప్రదేశాలలో మరియు కైలాస ద్వారం వద్ద పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అధికారులందరూ కూడా సమన్వయంతో పనిచేస్తున్నారు. భక్తులకు నేటి నుండి భక్తులకు నేటి నుండి ఉచిత లడ్డు ప్రసాదాలను కూడా పంపిణీ చేస్తున్నారు. అన్నదానాలు నిర్వహించే అన్న ప్రసాద దాతలకు దేవస్థానం తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తూ శ్రీశైలానికి వచ్చే శివ స్వాములకు భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తూ భక్తులకు ఇబ్బంది కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. భక్తులు సమన్వయం పాటిస్తూ అధికారులకు సహకరిస్తూ సిబ్బంది సూచనలు పాటిస్తూ స్వామి అమ్మవార్ల దర్శనాలు చేసుకుంటున్నారు.


శ్రీశైలం చేరుకుంటున్న భక్తులు


క్యూ లైన్‌లో వేచిఉన్న భక్తులు


తిలకం దిద్దుకుంటున్న భక్తులు


పాతాళ గంగలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు


ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న భక్తులు. శ్రీశైల పురవీధుల్లో స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం

# వైభవంగా పుష్ప పల్లకి సేవ

## అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు

**శ్రీశైలం (తెలుగోడు), ఫిబ్రవరి 13 :**
శ్రీశైల మహా క్షేత్రంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని నవాహ్నిక దీక్షతో పదకొండు రోజుల పాటు నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో ఆరవ రోజైన శుక్రవారం నాడు శ్రీ స్వామిఅమ్మవార్లకు విశేషపూజలు నిర్వహించారు. యాగశాలయందు శ్రీ చండీశ్వరస్వామికి ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. అనంతరం లోక కల్యాణం కోసం జపాలు, పారాయణలు చేయబడ్డాయి. మండపారాధనలు, పంచావరణార్చనలు, శివపంచాక్షరి, నిత్యహవనాలు, రుద్రహోమం, చండీహోమం, కార్యక్రమాలు ఆగమ శాస్త్రం ప్రకారంగా నిర్వహించారు. సాయంకాలం ప్రదోషకాల పూజలు, జపానుష్ఠానాలు, రుద్రపారాయణలు, హోమాలు నిర్వహించారు. రాత్రి శ్రీస్వామిఅమ్మవార్లకు పుష్పపల్లకీసేవ నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన శ్రీ స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను అక్కమహాదేవి అలంకార మండపంలో వేంచేపు చేయించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుష్పపల్లకి మేళతాళాలతో శ్రీ స్వామిఅమ్మవార్లను తొడ్కొని వచ్చి వివిధపుష్పాలతో అలంకరించబడిన పుష్పపల్లకిలో ఊరేగింపు చేయడం జరిగిందిఈ విశేషసేవలో ఎర్రబంతి, పసుపు బంతి, తెల్లచేమంతి, పసుపు చేమంతి, కనకాంబరాలు, డచ్ రోస్, అశోక పత్రాల మాల, కాగడాలు, గ్లాడియేలస్, అస్పెర్ గ్రాస్, జబ్రా, కార్నేషన్, ఆర్కిడ్స్, నందివర్ధనం, గరుడవర్ధనం మొదలైన పలు రకాల పుష్పాలను వినియోగించారు పురాణాలలో శ్రీశైల మల్లికార్జునస్వామివారు పుష్పప్రియుడని చెప్పబడింది. ఈ కారణంగానే ఆయా కైంకర్యాలన్నీ శ్రీ స్వామివారికి పరిపూర్ణంగా అర్పింపజేయాలనే భావనతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలోనూ, దసరామహోత్సవాలలోనూ ఈ పుష్పపల్లకీ సేవ నిర్వహించడం జరుగుతోంది ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు అర్చక వేద పండితులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు


శ్రీశైల పురవీధుల్లో స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం


పుష్పపల్లకి ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


ఉత్సవంలో విన్యాసాలు చేస్తున్న కళాకారులు. స్వామి అమ్మవార్లు ఉత్సవమూర్తులు



## ఫిబ్రవరి 14...
## ప్రేమ కాదు,
## పరాక్రమపు జ్ఞాపకం...

ఫిబ్రవరి పద్నాలుగు
పూల గుత్తుల రోజు కాదు,
పరిమళాల మాటల రోజు కాదు...

రక్తపు చారలతో రాసిన
దేశభక్తి గ్రంథం తెరచుకునే రోజు...

సరిహద్దుల గాలిలో
గుండెలు మోగిన శబ్దం వినిపించిన రోజు,
మాతృభూమి కోసం
మృత్యువుకి ఎదురెళ్లిన అడుగుల రోజు....

పూలు కాదు, పుష్పాంజలి కావాలి,
పాటలు కాదు, నిశ్శబ్ద నివాళి కావాలి....

మన నవ్వుల వెనుక
వారి త్యాగం నిలబడి ఉందని
మనసారా గుర్తు చేసుకునే వేళ ఇది...

కుటుంబాల కన్నీళ్లు
దేశ గర్వంగా మారిన రోజు,
అమ్మల హృదయాల్లో నొప్పి
జాతీయ జెండాగా ఎగసిన రోజు....

ప్రేమ అంటే
కేవలం ఇద్దరి మధ్య అనుబంధం కాదు,
నలభై కోట్ల హృదయాల కోసం
ఒక గుండె ఆగిపోవడమే నిజమైన ప్రేమ....

ఫిబ్రవరి 14...
చాక్లెట్లు కరిగే రోజు కాదు,
చరిత్ర గుండెల్లో చెక్కిన
అమర జవాన్ల జ్ఞాపకాల రోజు...

వారికి సెల్యూట్ చేస్తూ
మనసు తలవంచే రోజు,
మన స్వేచ్ఛ కోసం
వారి శ్వాస ఆగిపోయిన రోజు...

ఈ రోజు ప్రేమికుల దినం కాదు...
ప్రాణాలర్పించిన వీరుల
అమర గాథల దినం....

పుల్వామా దాడిలో (ఫిబ్రవరి 14) వీరమరణం పొందిన అమర జవాన్లకు నివాళులు అర్పిస్తూ...
జోహార్..

**– బాబ్‌జాన్, సీనియర్ జర్నలిస్టు**

# కథా కథనంలో కనిపించని కెమిస్ట్రీ




విష్వక్‌సేన్ వరుస సినిమాలతో అలరిస్తున్నప్పటికీ విజయం దక్కిన సినిమాలు తక్కువే. 'జాతి రత్నాలు'తో విజయాన్ని అందుకున్న దర్శకుడు కేవీ అనుదీప్ కాంబినేషన్‌లో వచ్చిన తాజా చిత్రమే 'ఫంకీ'. ఓ కొత్త దర్శకుడు. మంచి ప్రొడక్షన్స్ అనే నిర్మాణ సంస్థలో అవకాశం అందుకుని రూ.4 కోట్లలో పూర్తి చేస్తానని చెప్పి 'ఫంకీ' అనే సినిమాని మొదలు పెడతాడు. ఆ బ్జడెట్ కాస్త రూ.40 కోట్లకు చేరినా సినిమా పూర్తి కాదు. దాంతో మంచి నిర్మాత (నరేశ్) ఒత్తిడికి గురై ఆస్పత్రిలో చేరాల్సి వస్తుంది. అది తెలుసుకున్న నిర్మాత కుమార్తె చిత్ర (కయాదు లోహార్) సినిమా బాధ్యతల్ని తీసుకుంటుంది. బడ్జెట్ పెరగకుండా దర్శకుడితో మూవీ చేయిస్తానని చెప్పి, రంగంలోకి దిగుతుంది. మరి అనుకున్న బడ్జెట్‌లోనే కోమల్‌తో సినిమాని పూర్తి చేయించిందా?అది పూర్తయ్యేలోపు ఆ ఇద్దరి మధ్య ఏం జరిగిందన్నదే చిత్రకథ. కథ కంటే ఇందులో నవ్వులే కీలకమని నిర్మాత నాగవంశీ ముందే ప్రేక్షకుల్ని సిద్ధం చేశారు. ఆయన చెప్పినట్టే అనుదీప్ మార్క్ పాత్రలు, సంభాషణలు ఈ సినిమాకి కీలకం. అయితే సినిమాకి కథ కూడా అవసరమే అనే విషయాన్ని 'ఫంకీ' అడుగడుగునా గుర్తు చేస్తుంది. సరైన కథంటూ లేకపోతే మిగతా హంగులు ఎన్ని ఉన్నా అవేవీ పెద్దగా ప్రభావం చూపించవని ఈ సినిమా మరోమారు నిరూపిస్తుంది. 'జాతిరత్నాలు'తో తెలుగు ప్రేక్షకులకు ఓ కొత్త రకమైన హాస్యాన్ని పరిచయం చేశారు అనుదీప్. అమాయకత్వం నిండిన పాత్రలు చేసే అల్లరి, ఆ పాత్రలు మాట్లాడుకునే విధానం నుంచి పండిన హాస్యం ప్రేక్షకులకు గమ్మత్తుగా అనిపించింది. అప్పట్నుంచి అనుదీప్ ప్రతి సినిమానీ అదే పంథాలో తెరకెక్కిస్తున్నారు. 'ఫంకీ'లో కొన్ని సంభాషణలు మినహా మిగతావేవీ సరైన ప్రభావం చూపించవు. కథ కూడా సినిమా రంగంతో ముడిపడింది కావడంతో, సంభాషణలు సినీ పరిశ్రమ వాతావరణం గురించి అవగాహన ఉన్నవాళ్లకు అర్థమవుతాయే తప్ప సామాన్య ప్రేక్షకులకు పెద్దగా కిక్ ఇవ్వవు. అతిథి పాత్రలు ఇందులో చాలానే ఉన్నాయి. అయితే, ఒకట్రెండు మినహా మిగిలివన్నీ కూడా బలవంతంగానే అనిపిస్తాయి తప్ప, పెద్దగా కథకు అవసరం అన్నట్టుగా అనిపించవు.సినిమాల్లో భావోద్వేగాలు ప్రధానం. అలాంటి సినిమాని తెరకెక్కించే దర్శకుడిని భావోద్వేగాలు, బంధుత్వాల గురించి అసలేమీ తెలియనివాడిలా చూపించడం కూడా అంతగా కుదరలేదు. కథానాయిక పాత్ర సినిమాలో కీలకం. చాలా సన్నివేశాల్లో ఆమె కనిపిస్తూ, అందంతో కట్టిపడేస్తుంది. కానీ ఆ పాత్ర మాత్రం కథపై పెద్దగా ప్రభావమే చూపించదు. నరేశ్, సంపత్‌రాజ్... ఇలా మరికొన్ని పాత్రలు మినహా మిగిలిన వారికి పెద్దగా ప్రాధాన్యం లేదు. అనుదీప్ బలం ఆయన మార్క్ సంభాషణలే. ఇందులోనూ అవే పనిచేశాయి. ఇందులోనూ ఓ కథ ఉందని అప్పుడప్పుడూ అనిపించినా, ఆ వెంటనే ఆగిపోయిన సినిమాలా కథ కూడా అక్కడే ఉంటుంది తప్ప ఎంతకీ ముందుకు సాగదు. పతాక సన్నివేశాల్లో నాయకానాయికలు ఒకరికొకరు ప్రేమని వ్యక్తం చేసుకోవడం, కథానాయకుడికీ, తల్లికీ మధ్య తీర్చిదిద్దిన భావోద్వేగాలు సినిమాకి కీలకం. విష్వక్‌సేన్ తన పాత్రని బాగా అర్థం చేసుకుని అందులో ఒదిగిపోయే ప్రయత్నం చేశారు. భీమ్స్ స్వరపరిచిన పాటలు బాగున్నాయి. చిత్రీకరణ కూడా మెప్పిస్తుంది. విజువల్స్ నాణ్యంగా ఉన్నాయి. అనుదీప్ ఇదివరకు తీసిన 'జాతిరత్నాలు' ఒక ప్రత్యేకమైన చిత్రంగా నిలిచింది.

# మార్చి 6న సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని విడుదల

నటుడు శివాజీ వరుస చిత్రాలతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన స్వీయ నిర్మాణంలో శ్రీ శివాజీ ప్రొడక్షన్స్ పతాకంపై రూపొందిన తాజా చిత్రం 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని' విడుదల విషయంలో ఆసక్తికర మలుపు చోటుచేసుకుంది. మొదట ఈ సినిమాను నేరుగా ఓటీటీలో విడుదల చేయాలని నిర్ణయించిన చిత్రబృందం, చివరి నిమిషంలో థియేట్రికల్ రిలీజ్ వైపు మళ్లింది. ఈ చిత్రంలో శివాజీకి జోడీగా సీనియర్ నటి లయ నటించారు. ప్రారంభంగా ఈ సినిమానుఈటీవీ విన్ వేదికగా ఫిబ్రవరి 12 నుంచే స్ట్రీమింగ్ చేయనున్నట్లు ప్రకటించారు. అందుకు అనుగుణంగా ప్రమోషన్లు కూడా నిర్వహించారు. అయితే ట్రైలర్‌కు వచ్చిన స్పందన, ప్రేక్షకుల ఆసక్తి దృష్ట్యా చిన్న తెరపై కాకుండా ముందుగా వెండితెరపైకి తీసుకురావాలనే నిర్ణయానికి మేకర్స్ వచ్చారు. దీంతో ఇప్పుడు ఈ చిత్రాన్ని మార్చి 6న థియేటర్లలో విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. 'వచ్చే నెల 6న థియేటర్స్‌లో కలుద్దాం' అంటూ శివాజీ సోషల్ మీడియాలో పోస్టు చేయడం ద్వారా ఈ విషయాన్ని స్పష్టం చేశారు. ప్రేక్షకుల డిమాండ్ మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. ఇక ఈ సినిమాకు సుధీర్ శ్రీరామ్ దర్శకత్వం వహించగా, రోహన్, ప్రిన్స్, అలీ, ధనరాజ్, ఇమ్మాన్యుయేల్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. సంగీతాన్ని రంజిన్ రాజ్ అందించారు. నటుడు, నిర్మాత బండ్ల గణెళిష్ ప్రత్యేకంగా 'పాయా పాయా' పాటను రూపొందించడం ఈ చిత్రానికి మరింత హైలైట్‌గా నిలిచింది.

మొదట ఓటీటీ రిలీజ్‌గా ప్లాన్‌చేసిన ఈ సినిమా, ఇప్పుడు థియేట్రికల్ రిలీజ్‌తో బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాలి. ప్రేక్షకుల్లో ఇప్పటికే మంచి ఆసక్తి నెలకొనడంతో ఈ ట్విస్ట్ సినిమాపై మరింత హైప్ తీసుకొచ్చిందని చెప్పాలి.





చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో వచ్చిన 'మన శంకరవరప్రసాద్ గారు' థియేటర్‌లలో సందడి చేసి రికార్డులు సృష్టించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ సినిమా ఓటీటీలోనూ హవా చూపిస్తోంది. సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ చిత్రం నెల రోజుల తర్వాత ఫిబ్రవరి 11న జీ5 వేదికగా స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి వచ్చింది. అక్కడ కూడా ఒక్క రోజులోనే రికార్డును సృష్టించింది.ఏకంగా 24 గంటల్లో 200 మిలియన్ల మినిట్స్‌ను సొంతం చేసుకుంది. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో ఇది ఓ కొత్త రికార్డ్ అని సంస్థ జీ5 సంస్థ వెల్లడించింది. థియేటర్‌లోనే కాదు.. ఓటీటీలోనూ మరిన్ని రికార్డులు తన ఖాతాలో వేసుకోవడం ఖాయమని అభిమానులు భావిస్తున్నారు. కామెడీ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా రూ.375 కోట్లు వసూలు చేసి చిరు కెరీర్‌లోనే అత్యధిక వసూళు సాధించిన చిత్రాల లిస్ట్‌లో చేరింది. ఈ విజయంపై చిరంజీవి గతంలో మాట్లాడారు. 'వెండితెర మీద నన్ను చూడగానే మీరు వేసే విజిల్స్, చప్పట్లే నన్ను నడిపించే శక్తి. రికార్డులు వస్తుంటాయి.. పోతుంటాయి.. కానీ, మీరు నాపై కురిపించే ప్రేమ మాత్రం శాశ్వతం' అని అన్నారు.

# రణ్‌వీర్ సింగ్ కు బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి బెదిరింపులు



బాలీవుడ్ ప్రముఖ నటుడు రణ్‌వీర్ సింగ్ కు బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి బెదిరింపులు వచ్చాయి. రణ్‌వీర్‌ను, అతడి దగ్గర పనిచేస్తున్న వారినీ చంపేస్తానని బిష్ణోయ్ అనుచరుడి పేరుతో ఓ దుండగుడు హెచ్చరించాడు. ప్రముఖ దర్శకుడు రోహిత్ శెట్టిని కూడా ఇదే తరహాలో బెదిరించాడు. ఈ మేరకు వాట్సాప్‌లో ఓ ఆడియో సందేశం పంపించినట్లు సమాచారం. ఈ బెదిరింపు సందేశంతో బాలీవుడ్ లో కలకలం రేగుతోంది. తనను తాను బిష్ణోయ్ అనుచరుడిగా పేర్కొంటూ హ్యారీ బాక్సర్ అనే వ్యక్తి ఈ బెదిరింపులకు పాల్పడ్డాడు. తన డిమాండ్లను అంగీకరించకపోతే ఆ సెలెబ్రిటీలతోపాటు వారి సిబ్బందినీ హత్య చేస్తామని హెచ్చరించాడు. భవిష్యత్తులో ఏడు తరాలకు గుర్తుండి పోయేలా హత్య జరుగుతుందని వార్నింగ్ ఇచ్చాడు. 'రణ్‌వీర్ సింగ్.. ...

భవిష్యత్తులో ఏడు తరాలకు గుర్తుండిపోయేలా నిన్ను హత్య చేస్తాం. నువ్వు మా బెదిరింపులను లెక్క చేయకపోగా మిగతా వారికీ ఉచిత సలహాలు ఇస్తున్నావు. పోలీసులకు ఫిర్యాదు చేసేలా వారిని ప్రోత్సహిస్తున్నావు. నువ్వు కూడా ఓ కంప్లెయింట్ చేసినట్టున్నావు. పర్వాలేదు. ఇక నీకు మామూలుగా చెప్పం. నీ దగ్గర ఎవరెవరు పనిచేస్తున్నారు.. వారు ఎప్పుడు వస్తారు, ఎప్పుడు వెళతారు..? వారి కుటుంబాలు ఎక్కడ ఉంటున్నాయనే వివరాలు మొత్తం మా దగ్గర ఉన్నాయి. వారితో మొదలు పెడతాం. ఒక్కొక్కరినీ టా÷-గ్గ÷ట్ చేసి చంపేస్తుంటే అప్పుడు నీకు తెలిసివస్తుంది. నీకు ఇంకా టైమ్ ఉంది. హత్యలు మొదలయ్యేలోపే మేలుకో' అంటూ దుండగుడు తన ఆడియో సందేశంలో బెదిరించాడు. దర్శకుడు రోహిత్ శెట్టికి కూడా ఇది వర్తిస్తుందని అన్నాడు.

# మెగాస్టార్ మనవళ్లకు నామకరణం



మెగాస్టార్ చిరంజీవి ఇంట మరోసారి పండగ వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. ఇటీవల తనయుడు రామ్ చరణ్ ఉపాసన దంపతులు కవల పిల్లలకు జన్మనివ్వగా.. ఈ పిల్లలకు నామకరణ వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుక అనంతరం మెగాస్టార్ చిరంజీవి స్వయంగా తన మనవడు, మనవరాలి పేర్లను సోషల్ మీడియా వేదికగా ప్రకటిస్తూ ఆ పేర్ల వెనుక ఉన్న లోతైన అర్థాన్ని అభిమానులతో పంచుకున్నారు. మెగా కవలలకు శివరామ్ కొణిదెల, అన్వీర దేవి కొణిదెల అనే పేర్లను ఖరారు చేసినట్లు ఆయన వెల్లడించారు. మనువడికి పెట్టిన 'శివ రామ్' అనే పేరు రెండు గొప్ప వ్యక్తిత్వాల కలయిక అని చిరంజీవి వివరించారు. తన అసలు పేరు శివ శంకర వరప్రసాద్‌లోని 'శివ' అనే పదం అంతర్గత శక్తికి, ఆధ్యాత్మికతకు ప్రతీక అయితే, రామ్ చరణ్‌లోని 'రామ్' అనే పదం ధర్మానికి, కరుణకు చిహ్నామని పేర్కొన్నారు. అలాగే మనవరాలికి పెట్టిన 'అన్వీర దేవి' అనే పేరు దైవిక శక్తికి రూపమని, కనకదుర్గమ్మ తల్లి దీవెనలతో పెట్టిన ఈ పేరు భయం లేని తనాన్ని, అచంచలమైన ధైర్యాన్ని సూచిస్తుందని ఆయన తెలిపారు. అపరిమితమైన ఆనందంతో ఈ పేర్లను ప్రకటిస్తున్నామని, కొత్త జీవితాన్ని ప్రారంభిస్తున్న ఈ చిన్నారులకు అందరి దీవెనలు ఉండాలని చిరంజీవి ఎమోషనల్ అయ్యారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటో వైరల్‌గా మారింది.

Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD, PRGI No- APTEL/25/A2739 ..Cell No - 99634 96956, 73827 12780.